# ఎందరో వికీమీడియన్లు



# ఎందరో వికీమీడియన్లు

ఎందరో వికీమీడియన్లు...
రచన: వాడుకరి

ప్రథమ ముద్రణ: జనవరి 2024
(తెవికీ పండగ - 2024 సందర్భంగా)

ముఖపత్రం & పుస్తకం డిజైన్: సుష్మిత టి.

పేజీలు: 87

ప్రింటర్స్: ట్రినిటీ అకాడమీ, బెంగళూరు
Ph no: +91 93413 42475

ప్రచురణ:
సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ సొసైటీ - యాక్సెస్ టు నాలెడ్జ్,
బెంగళూరు.

కవర్ పేజీపై బొమ్మ: Susannaanas, CC0, వికీమీడియా కామన్స్ ద్వారా
పుస్తకం లైసెన్సు: సీసీ-బై-ఎస్ఏ 4.0

**ఈ పుస్తకం ప్రైవేటు పంపిణీ కొరకే ఉద్దేశించినది.**

# విషయసూచిక


**అసలు వికీపీడియా అంటే ఏమిటంటే...** **IX**

**ఇపుడీ పుస్తక మెందుకంటే** **XIII**

మూలకర్త **15**

జ్ఞానసముద్రుడు **17**

చరిత్రకారుడు **19**

మార్గదర్శకుడు **21**

ఆల్‌రౌండర్ **23**

వెయ్యిళ్ళ పూజారి **25**

సంరక్షకుడు **27**

ముదితల్ నేర్వగ లేని విద్యగలదె **29**

సార్ **31**

చుక్కాని **33**

ఇన్ఫ్లుయెన్సరు 35

తెవికీ స్వామి 37

నిర్మోహమైన సేవకుడు 39

సున్నితపు త్రాసు 41

నిశ్శబ్ద విప్లవకారుడు 43

జిజ్ఞాసువు 45

ఆతడనేక వికీ కార్యక్రమముల... 47

సైన్సు మాస్టారు 49

బృహస్పతి 51

క్షేత్రపాలకుడు 53

పీఠాధిపతి 55

స్ఫూర్తికి సోర్సు, సోర్సుకు స్ఫూర్తి 57

మెగామీడియన్ 59

అనువాదానికి ఆది గురువు 61

లాస్టు కాదు లేటెస్టు 63

వాసి >>> రాసి 65

తెవికీసోర్సు రాయంచ 67

సమాచార సేతువు 69

వికీరాకెట్టు 71

వికీసోర్సుకు దేవీప్రసాదం 73

వికీ కిరణం 75

భావికీపీడియన్ 77

రాబోయే కాలానికి కాబోయే నాయకుడు 79

భవ్యమైన రికార్డు 81

అస్తమించిన భాస్కరుడు 83

**ఉపసంహారం 85**

# అసలు వికీపీడియా అంటే ఏమిటంటే...

తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు చాలా అరుదు. అందునా ఎన్సైక్లోపీడియా బ్రిటానికా లాంటి బృహత్తర విజ్ఞాన సర్వస్వం అసలు లేనేలేదు. సాహిత్య అకాడమీ ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం ఉన్నా, అది సాహిత్య విషయాలకే పరిమితమైంది. ఉన్న కొద్దీ కూడా పెద్ద పెద్ద గ్రంథాలయాలలోనే లభ్యం. ఆవకాయ నుండి అంతరిక్షం దాకా, అటుకుల దగ్గర నుండి అణుబాంబు దాకా ప్రతీ విషయాన్ని వివరిస్తూ సాగే విశాల, విశిష్ట, విజ్ఞాన సర్వస్వాన్ని తయారుచెయ్యడమంటే మామూలు విషయం కాదు. అపార ధనవ్యయం, అశేషమైన పనిగంటలు, అనంతమైన పరిశోధన కావాలి. సకల వనరులూ ఉన్న ప్రభుత్వమో, డబ్బును గుమ్మరించగల పోషకులో పూనుకుంటే తప్ప, ఇలాంటి మహత్కార్యాలు సాధ్యం కావు. అటువంటి బృహత్కార్యాన్ని సాధించేందుకు నడుం కట్టారు, తెలుగువారు. ఐతే ఈ పనికి పూనుకున్నది ప్రభుత్వమో, విశ్వవిద్యాలయమో కాదు. కేవలం మనలాంటి సామాన్యులే భుజం భుజం కలిపి ఈ పని చేస్తున్నారు. కొన్నివందల మంది ఉత్సాహవంతులు నిరంతరం శ్రమిస్తూ కోట్ల మందికి ఉపయోగపడగల ఒక విజ్ఞాన కోశాన్ని తయారు చేస్తున్నారు. ఇంతకీ ఏమిటీ విజ్ఞాన కోశం? ఎక్కడ రాస్తున్నారు, ఎవరు రాస్తున్నారు?

అప్పుడెప్పుడో 2001లో మొదలైంది ఈ కథ. లోకంలోని విజ్ఞానాన్నంతటినీ ఒకచోట చేర్చి ప్రజలంతా స్వేచ్ఛగా వాడుకునే వీలు కల్పించాలనే సంకల్పంతో మొదలైంది. ఎక్కడుంది ఈ విజ్ఞానం.. భాండాగారాల్లో ఉంది, సైన్సు పేపర్లలో ఉంది, పుస్తకాల్లో ఉంది, వార్తా పత్రికల్లో ఉంది, పెద్దపెద్ద సర్వర్లలో ఉంది, పర్సనల్ కంప్యూటర్లలో ఉంది, మెమరీ చిప్‌లలో ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ కొందరో అందుకోగలిగే తావుల్లో ఉంది. దీన్నంతటినీ ఎలా తెస్తారు? ఎవరు తెస్తారు? ఎక్కడ పెడతారు?

**ఎలా తెస్తారు**: ఈ సమాచారాన్నంతటినీ చదివి, తేనెటీగలు మకరందాన్ని సేకరించినట్లు వాటిలోని సారాన్ని సేకరించి తెస్తారు.

**ఎవరు తెస్తారు**: స్వచ్ఛందంగా పనిచేసే చదువరులు, లేఖకులు.

**ఎక్కడ చేరుస్తారు**: ఇదిగో ఈ వికీపీడియాలో.

వికీపీడియానా.. అంటే?

వికీపీడియా అనే పేరు ఎలా వచ్చిందనే కథాక్రమం బెట్టిదనిన..

చకచక, పకపక, గబగబ, సలసల, టపటప, తపతప అంటూ జమిలి పదాలున్నాయి కదా మనకు. విడిగా వాటికి అర్థం లేదు, కానీ జంటగా చక్కటి అర్థాన్నిస్తాయి. అలాంటి జమిలిపదాలే హవాయీ భాషలో కూడా ఉన్నాయి. వాటిలో వికివికి అనే మాట ఒకటి. దాని అర్థం చకచక/గబగబ అని. ఆశ్చర్యంగా ఉందా? ఔను, నిజమే!

హవాయి విమానాశ్రయంలో ఈ మాట విన్న వార్డ్ కన్నింగ్‌హామ్ అనే పెద్దాయనకు అది నచ్చి, 1995 లో తన వెబ్‌సైటుకు ఆ పేరు పెట్టాడు. ఎవరైనా మార్పుచేర్పులు చేసేలా, ఆ మార్పులు కూడా చకచకా చెయ్యగలిగేలా ఆ వెబ్‌సైటును తయారుచేస్తూ దానికి వికివికివెబ్ అని పేరు పెట్టాడు. ఆ వికీ అనే పేరునే తరువాత వికీపీడియాకు కూడా వాడారు. వికివికి+ఎన్‌సైక్లోపీడియా = వికీపీడియా అన్నమాట! 2001లో ఇంగ్లిషులో మొదలైన వికీపీడియా ప్రస్తుతం 326 భాషల్లో ఉంది. తెలుగులో వికీపీడియా 2003 డిసెంబరులో మొదలైంది. మనం దీన్ని గబగబపీడియా అనో చకచకవిజ్ఞానం అనో కూడా అనుకోవచ్చు. తెలుగు వికీపీడియాకు అది ప్రత్యేకం! (చెతురుగా)

వికీపీడియాలో రాసేది ఎవరో ప్రత్యేకంగా అందుకోసం నియమితులైన రచయితలేమీ కాదు. ఉన్నత విద్యావంతులు, శాస్త్రవేత్తలూ ఉన్నారు,

సామాన్యులూ రాస్తున్నారు. వికీపీడియాలో ఎవరైనా రాయవచ్చు, ఏ విషయం గురించైనా రాయవచ్చు. కొన్ని నిబంధనలకు, కట్టుబాట్లకు లోబడితే చాలు. అలాగే వికీపీడియాలోని వ్యాసాలను ఎవరైనా ఉచితంగా చదువుకోవచ్చు, డబ్బు కట్టక్కరలేదు. అంతేనా, ఆ వ్యాసాలను మీరు ప్రింటు తీసుకోవచ్చు. అసలు వికీపీడియా మొత్తాన్ని మీ కంప్యూటరు లోకి డౌనులోడు చేసుకోవచ్చు - పైసా డబ్బు చెల్లించకుండా!! ఇంకా అయిపోలేదు, ఈ మొత్తం వికీపీడియాను ప్రింటు తీసేసి, పుస్తకాలుగా కుట్టేసుకోవచ్చు. ఆగండి, ఇంకా ఉంది.. ఈ పుస్తకాలను పెద్దసంఖ్యలో ప్రింటేసి, వెల కట్టి అమ్ముకోనూ వచ్చు!!!! వికీపీడియా మిమ్మల్ని పన్నెత్తి మాటనదు, పైసా డబ్బడగదు. ఒకే ఒక్కమాట - దీన్ని నేను వికీపీడియా నుండి సేకరించాను అని రాస్తే చాలు.

# ఇపుడీ పుస్తక మెందుకంటే

తెవికీకి జన్మనిచ్చి, పెంచి, పోషించి, విధానాలు మార్గదర్శకత్వాలతో నడక, నడత నేర్పి, వ్యాసాలతో బలమిచ్చి, హంగూ ఆర్భాటాలతో సౌష్ఠవమైన రూపునిచ్చిన తెవికీయులు ఎందరో. తమ కృషితో వీళ్ళు తెలుగు వికీపీడియాను గణనీయంగా అభివృద్ధి చేసారు. ఏ అంశం కోసమైనా తెలుగులో గూగుల్లో వెతకండి.. అది చూపే ఫలితాల్లో తెలుగు వికీపీడియా ముందుంటుంది. అందులో సాంకేతికపరమైన మాయ ఏమీ లేదు, మంత్రమూ లేదు - కేవలం వికీపీడియన్ల కఠోరమైన కృషి తప్ప. అయితే, వికీలో అందరూ ఎల్లప్పుడూ పనిచేయరు. కొన్నేళ్ళు పనిచేసి మానేస్తారు. కొత్త నీరు వస్తూంటుంది, పాత నీరు పోతూంటుంది. కొందరు మళ్ళీ వస్తారు పనిచేస్తారు. ప్రతి ఒక్కరూ చేసిన పనుల్ని వికీ గుర్తుంచుకుంటుంది. అవన్నీ వికీలో చిరస్థాయిగా నిలిచే ఉంటాయి. వికీమీడియా ప్రాజెక్టులు వాళ్ళ కృషిని ప్రతిఫలిస్తూ దేదీప్యంగా వెలుగుతూ ఉంటాయి, ఉన్నాయి. అలా వికీలకు వెలుగులద్దిన కొందరు వికీసూర్యులకు మా దివిటీ ఇది.

# మూలకర్త

రాజీవ్ గాంధీ భారతదేశానికి పర్సనల్ కంప్యూటరు తెచ్చాడు. పీవీ, మన్మోహన్‌లు కొత్త ఆర్థిక విధానాలు తెచ్చారు. వాజపేయి భరత మాత మెడలో రహదారుల నగ అమర్చాడు. వెన్నా నాగార్జున తెలుగు వికీపీడియా తెచ్చాడు.

విండోస్ 98, ఎక్స్‌పి ల రోజులవి. కంప్యూటర్లకు అసలు తెలుగు చూపించడమే తెలియని రోజులు. కంప్యూటర్లో తెలుగు కనబడేది కాదు, ఏవో పెట్టెలు కనబడేవి. తెలుగు చూపించాలంటే వాటి సెట్టింగుల్లో మార్పులు చేసుకోవాల్సి వచ్చేది. ఇక తెలుగులో టైపించడమంటే మరీ కష్టం. తెలుగు కీబోర్డుల్లేవు. ఉన్నా, ఆ లేఔట్లు ఒక్కోటి ఒక్కో రకంగా ఉండేవి. అలాంటి రోజుల్లో, మామూలుగా రోమను లిపిలోనే టైపు చేస్తే తెలుగు లిపిలోకి మారిపోయేలా పరికరాన్ని రూపొందించాడు నాగార్జున. తన సాఫ్టువేరు పరిజ్ఞానాన్ని తెలుగు కోసం ఉపయోగించాడు. యాహూ వారి జియోసిటీస్ అనే వెబ్‌సైటులో ఒక పేజీపెట్టి అందులో పద్మ అనే లిప్యంతరీకతరణ పరికరాన్ని అమర్చాడు. 20 యేళ్ళ కిందటే ఈ పరికరాన్ని తయారుచేసాడు. ఆ వెబ్‌సైటు ఇప్పుడు లేదు. ఆర్కైవు వారి పుణ్యమా అని వాళ్ళ భాండాగారంలో చూడొచ్చు దాన్ని ఆ పేజీలో ఉండే పెట్టెలో రోమను లిపిలో తెలుగు రాసి, తెలుగులోకి మార్చు అనిచెప్తే దాన్ని తెలుగు లిపిలో చూపించేది. ఆహా తెలుగులో రాయడం ఇంత తేలికా అనుకున్నారందరూ.

ఇదే నాగార్జున తెలుగు వికీపీడియాను కూడా తెచ్చాడు. ఇక చూడండి.. పద్మ పేజీలో తెలుగు రాయడం, దాన్ని కాపీ చేసి తెచ్చి వికీపీడియాలో పెట్టడం. ఇలా సాగింది తెలుగు వికీపీడియా ప్రస్థానం. అన్నట్టు తెవికీ

"మొదటిపేజీ"కి ఆ పేరు పెట్టినది అతడే. ఆ తరువాత దాన్ని మార్చాలని కొందరు అన్నారు గానీ అదే నిలబడి పోయింది. ప్రతి పేజీకీ ఉండే "చరిత్ర" ట్యాబుకు నాగార్జున తొలుత "చరితం" అని పెట్టాడు. తరువాత దాన్ని మార్చారు. తెవికీ యవనికపై అప్పట్లో వెలిగిన తెలుగు తళుకులకు తెరవెనక ఉన్న చోదక శక్తి అతను.

పాలు పితకడం నుండి మజ్జిగ చెయ్యడం దాకా ఎలా చేసాడో, ఏ కష్టాలు పడ్డాడో తెలీదు గానీ.. నాగార్జున పంచిన వెన్నను మాత్రం అందరూ ఆస్వాదిస్తున్నారు.

# జ్ఞానసముద్రుడు

ఆంధ్ర సాగర తీరం నుండి పసిఫిక్ సముద్ర తీరం దాకా విస్తరించిన విజ్ఞాన సముద్రం వేమూరి వెంకటేశ్వరరావు గారు. ప్రొఫెసరుగా, పరిశోధకుడిగా, శాస్త్రవేత్తగా, సైన్సు రచయితగా విస్తరించిన విజ్ఞాన వటవృక్షం ఆయన. సుప్రసిద్ధి చెందిన యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ప్రొఫెసర్‌గా విజయవంతమైన పరిశోధనా, వృత్తి జీవితాన్ని కలిగిన ఆయన తన అనుభవాన్ని, శాస్త్ర జ్ఞానాన్ని తెలుగులో విజ్ఞాన సృష్టికి వినియోగించాలని ఏనాడో నిశ్చయించుకున్నారు. సులువైన తెలుగులో సైన్సును పరిచయం చేస్తూ పుస్తకాలు రాసారు. ఇంగ్లీషు పదాలకు తేలికైన తెలుగు పదాలు సృష్టించిన ప్రత్యేకత ఆయనది. బణువు, చిణువు, వారసవాహిక... ఈ పేర్లన్నీ ఆయన సృష్టించినవే. అంతటి వేమూరి గారు కూడా వేమన చెప్పినట్లు... కొంచెమై తెవికీ అద్దంలో ఒదిగిపోయారు. ఆయన తెలుగు వికీపీడియాలో కూడా కృషి చేయడం వికీపీడియాకూ వికీమీడియన్లకూ కలిగించిన గౌరవం.

తొట్టతొలి వికీమీడియన్లలో ఆయనొకరు. తెవికీలో సృష్టించిన తొలి 20 వ్యాసాల్లో ఐదు వేమూరివన్ అన్న వాడుకరి పేరుతో ఆయన రాసినవే. కంప్యూటర్ హార్డ్‌వేరు గురించీ భూగర్భం గురించీ రాసారు, విభూతి గురించీ కారం గురించీ రాసారు. వ్యాసాల్లో భాష నాణ్యత గురించిన చర్చల్లో చురుగ్గా పాల్గొంటారు. తెలుగు వికీబుక్స్‌లో ఇంగ్లీషు-తెలుగు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులను కూర్చారు. తాను రామానుజన్ జీవితంపై రాసిన ఒక పుస్తకం ఎవరైనా, ఎందుకైనా వాడుకోవచ్చన్న లైసెన్సులో విడుదల చేసి వికీసోర్సులో పెట్టించారు.

ఈనాటికీ చురుగ్గా కృషిచేస్తున్న తొలి వికీమీడియన్లలో ఆయనే ప్రథముడు. వేమూరివన్ అంటే తెవికీవన్. ఆయనకి దివిటీ పట్టే చిరు ప్రయత్నం ఇది.

# చరిత్రకారుడు

తెలుగు వికీపీడియాలో సాంకేతికపరమైన అనేక పనులు చేసిన వ్యక్తి ఎమ్.ప్రదీప్. తెలుగు వికీపీడియా తొలినాళ్ళ చరిత్రను అక్షరబద్ధం చేసిన చరిత్రకారుడతడు. తెవికీలో గణాంకాలు ఎలా ఉన్నాయో చూడడం మొదలుపెట్టిన వ్యక్తి.

వికీపీడియాలో వ్యాసం అనేది ప్రధాన అంశమైతే దానికి అనుబంధంగా, వ్యాసానికి అనేక హంగులు సమకూర్చే మూస, వర్గం వంటి ఇతర రకాలైన పేజీలుంటాయి. ఉదాహరణకు వికీపీడియా వ్యాసాల్లో కుడిపక్కన పైన సమాచారంతో ఒక పెట్టెలాంటిది ఉంటుంది కదా, 'సమాచార పెట్టె' అంటారు దాన్ని. అదొక మూస. అన్ని పేజీల్లోనూ ఈ హంగు బావుండాలంటే మూస సరిగ్గా ఉండాలి. వ్యాసాల సంఖ్యకు ఇవి మూణ్ణాలుగు రెట్లు ఉంటాయి. సాధారణంగా వాడుకరులు ఈ అనుబంధ పేజీల్లో తక్కువగా పని చేస్తారు. కానీ ప్రదీప్ అలాకాదు, అతను వ్యాసాల్లో కంటే ఈ అనుబంధ పేజీల్లోనే ఎక్కువ పనిచేసేవాడు. పేజీలకు హంగులు చేకూర్చడంలో ఎక్కువ కృషి చేసేవాడు. తాను చేసిన మొత్తం కృషిలో దాదాపు నాలుగోవంతు వీటి కోసమే కేటాయించాడు. అందుకే 11 వేలకు పైగా దిద్దుబాట్లు చేసినప్పటికీ అతను సృష్టించిన పేజీలు మాత్రం ఆరు వందలే.

ఇంకొకటి...వికీపీడియాలో విధానాల రూపకల్పనకు వికీయుల అభిప్రాయాలు ఎంతో ముఖ్యం. అవును/కాదు, చెయ్యాలి/చెయ్యకూడదు అని పొడిపొడిగా చెబితే చాలదు, ఎందుకో చెప్పాలి అని వికీ అంటుంది. తెవికీలో ఏకవచనమే వాడాలి అనే ప్రతిపాదన వచ్చినపుడు.. ప్రదీప్ తొలుత దాన్ని సమర్థించాడు. ఎందుకు సమర్థిస్తున్నాడో హేతువూ చూపించాడు.

కానీ ఆ తరువాతి కాలంలో అతనికి ఆ పద్ధతి నచ్చలేదు. తన అభిప్రాయాన్ని మార్చుకుంటూ మళ్ళీ రాసాడు, ఎందుకు నచ్చడంలేదో! ఇక్కడ విషయం ఏమిటంటే... తన అభిప్రాయంలో వచ్చిన మార్పును చక్కటి హేతువుతో వివరించాడు. అంచేతనే అతను అభిప్రాయం మార్చుకున్నా ఎవరూ అభ్యతర పెట్టలేదు. నువ్వు చెప్పేది బానే ఉందన్నారు. అలా హేతుబద్ధంగా ఆలోచించి చర్చ చేసేవాడు ప్రదీప్.

# మార్గదర్శకుడు

ఇదిగో వెన్న, రండి ఆస్వాదిద్దాం అని పిలిచి రుచి చూపించినవాడు వైజాసత్య రవి. తెవికీ పుట్టిన కొత్తలో వ్యాసం ఎలా రాయాలి, దాని లక్షణాలు ఏమిటి, అసలు తెవికీ గుణాలేంటి అనేవి దాదాపుగా ఎవరికీ తెలీదు. ఎవరికి తోచినట్టు వాళ్ళు రాస్తూండేవాళ్ళు. ఏ విషయానికి వ్యాసం రాయొచ్చో, దేనికి రాయకూడదో తెలీదు. ఇలాంటివన్నీ తాను నేర్చుకుంటూ తోటివారికి నేర్పిన వ్యక్తి వైజాసత్య.

మూలస్థంభాలూ ముఖద్వారాలూ అంటూ ఏమిటో... తెగ చెబుతూ ఉండేవాడు. విధానాలు మార్గదర్శకాలూ అంటూ విసిగించేవాడు. తాను మాత్రం విసుక్కునేవాడు కాదు. ఇలాకాదు, మనం రాసేదానికి ఆధారాలుండాలి. వాటిని వ్యాసంలో పెట్టాలి, అని చెప్పాడు. చర్చలు ఇలా జరగాలి, నిర్ణయాలు ఇలా చెయ్యాలి అని చెప్పాడు. నిర్వాహకత్వం ఇలా ఉండాలి అని చెప్పి అందుకు ఉదాహరణగా నిలిచాడు. చర్చల్లో తాను మాట్లాడేవాడు, ఇతరుల చేత మాట్లాడింపజేసేవాడు. హేతుబద్ధంగా చర్చించేవాడు. అవతలి వారి వాదనల్లో హేతువును చూసేవాడు. నెమ్మదిగా ఉంటూనే వేగంగా పనిచేసేవాడు. మృదువుగా ఉంటూనే నిష్కర్షగా ఉండేవాడు.

శైశవంలో ఉన్న తెవికీని చెయ్యిపట్టుకుని నడక, నడవడిక నేర్పినవాడు వైజాసత్య. వ్యాసాల్లో వ్యక్తులను ఏకవచనంలోనే ఉదహరించాలి అనేది ప్రతిపాదించి దానికి ఆమోదముద్ర సాధించినవాడతడు. దానికి సమర్థనగా వివిధ వాదనలు చేస్తూ ఇదివరకటి తెలుగు విజ్ఞాన సర్వస్వాల ఒరవడిని దృష్టాంతంగా చూపించాడు. వైజాసత్య ప్రతిపాదించిన ఆ విధానమే నేటికీ

తెవికీ పాటిస్తోంది.

"పదేళ్ళ తర్వాత తెలుగు వికీ ఇప్పటికంటే నాణ్యంగా ఉంటుందని నా నమ్మకం. అయితే అభివృద్ధి గణనీయంగా ఉంటుందా, సాధారణంగా ఉంటుందా అనేది వికీ ఇంటా, బయటా ఉద్యమంగా నడిపించగల నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది." అన్నాడొకసారి. ఆ తరువాత తెవికీ నుండి తప్పుకుని తన స్వంత పనుల్లో మునిగిపోయాడు. ఈ ముక్క చెప్పి ఎనిమిదిన్నర ఏళ్ళైంది. తెవికీ అభివృద్ధి ఎలా ఉందో చెప్పడానికైనా అజ్ఞాతం నుండి తిరిగి రావయ్యా రవివర్మా!

# ఆల్‌రౌండర్

ఒకే ఆటగాడు అద్భుతమైన బౌలింగూ, బ్రహ్మాండమైన బ్యాటింగూ చేస్తే ఆల్‌రౌండర్ అంటారు. అదే చేత్తో కళ్ళుచెదిరే ఫీల్డింగ్ కూడా చేస్తే ఏమనాలో తెలియక అవాక్కవుతారు. అదే మనిషి కెప్టెన్సీలోనూ రాణిస్తే? ఇన్నీ చేశాకా జట్టుకు అవసరమైనప్పుడు వికెట్ కీపింగ్ కూడా చేయగలిగితే. "అబ్బే! అలా చేయడం అసాధ్యం" అంటారు. కానీ, అలాంటి ఫీటే ఒక దశాబ్దంపైగా తెలుగు వికీపీడియాలో చేస్తున్న మనిషిని తెవికీలో అంతా "చదువరి" అంటారు. చదువరి ఆల్‌రౌండర్ మాత్రమే కాదు తెవికీ ఇన్నింగ్సులో అజేయంగా కొనసాగుతున్న ఓపెనింగ్ బ్యాట్స్‌మేన్. అతను వృత్తిరీత్యా ఇంజనీరు. ఏ పని తలకెత్తుకున్నా, దాని బరువు, వైశాల్యమూ, స్వరూపమూ, స్వభావమూ క్షుణ్ణంగా, వేగంగా అంచనా కట్టడం అతనికి వృత్తితో పట్టుబడ్డ విద్య. ఆ పనిని చివరిదాకా తీసుకెళ్ళే పట్టుదల మాత్రం అతనికి పుట్టిపెరిగిన మట్టి నుంచి వచ్చిందని వినికిడి.

తెవికీలో రాసేవారి సంఖ్య ద్విగుణం, త్రిగుణం, బహుళం కావాలనీ, వ్యాసాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగాలనీ అతని కోరిక. ఇదంతా జరిగేప్పుడు నాణ్యతలో ఏమాత్రం రాజీపడకూడదని అతని వ్రతం. చక్కని భాషలో వ్యాసాలన్నీ ఎదగాలని అతని కోరిక. వ్యాసాలు రాయడం ఎంత ముఖ్యమో, చర్చలు చేయడం, విధానాలు రూపొందించడం, అమలుచేయడం అంతే ముఖ్యమని అతని సూత్రం. దారేపోయేవారైనా సరే - తెలుగు వికీపీడియా వ్యాసాల్లో లోటుపాట్లు ఇవీ అని చీల్చిచెండాడి 'ఉన్న తప్పుల'న్నీ ఏకరువు పెట్టారనుకోండి, వాళ్ళు అతనికి పరమ ఆప్తులు అయిపోతారు. ఎందుకంటే, తప్పులేమిటో తెలిస్తే దిద్దుకోవచ్చన్నది అతని నమ్మిక. తెవికీకి అవసరమైనది ఏదైనా తనకు వస్తే చేసేస్తాడు, రాకపోతే నేర్చుకుంటాడు, వీలుకాకపోతే

తెలిసినవాళ్ళతో చేయిస్తాడు, కలసివచ్చేవాళ్ళు కనిపిస్తే భుజం కలిపి పనిచేస్తాడు, "మీరన్నది తప్పు" అని చెప్పాల్సివస్తే గౌరవంగా, నిక్కచ్చిగా చెప్తాడు, "నేను చేసింది తప్పు" అని ఒప్పుకోవాల్సి వస్తే నిస్సంకోచంగా ఒప్పుకుంటాడు, నేర్చుకుంటానంటే తనకొచ్చినదంతా నేర్పిస్తాడు, వీలైతే చిన్నవారి భుజాన కండువా వేసి వెనక నిలబడతాడు.

వికీలో జరిగేదంతా ఉమ్మడి కృషి కనుక ఘనత మొత్తం సముదాయానికే చెందాలి తప్ప వ్యక్తిగతంగా ప్రత్యేకతలు ఆపాదించకూడదన్నది చదువరికి ఉన్న నిశ్చితమైన అభిప్రాయాల్లో ఒకటి. తెవికీ అనే నదిలో అంతర్వాహినిలానే తానుండాలని అతని సంకల్పం. కానీ, కృషి, ప్రతిభ, పట్టుదల ఒకచోట రాశిపోసినప్పుడు ఆ వెలుగు జిగేలుమని చుట్టూ ఉన్నవారి దృష్టిని ఆకర్షించనివ్వకుండా ఆపడం ఎవరి తరం!

# వెయ్యేళ్ళ పూజారి

వెన్నా నాగార్జున గారి పద్మ పరికరాన్ని చూసి ఆహా తెలుగులో రాయడం ఇంత తేలికా అని అందరూ అనుకుంటూంటే... అక్కడెక్కడో మూలన కూచున్న ఒకాయన, అంత కాదు, అంతకంటే తేలిక అన్నాడు. ఎవర్నువ్వు అన్నారు... నేను వీవెన్ని అన్నాడు. ఏదీ ఎంత తేలికో చూపించూ అన్నారు... ఇదిగో ఇం...థ తేలిక అంటూ లేఖిని ని రూపించి, చూపించి, నిరూపించాడు. నాగార్జున గారి పద్మ పరికరం చేసే పనే లేఖిని కూడా చేసేది, కాకపోతే వాడుకోడానికి మరింత తేలిగ్గా ఉండేది. మనం ఇలా ఇంగ్లీషులో రాస్తూంటే అది అలా తెలుగులో రాస్తుంది. "నిజమే వీవెన్ గారూ, చాలా తేలికే సుమండీ" అన్నారందరూ!

నిజానికి ఇవ్వాళ్టికి కూడా లేఖిని అంటే అనేక మందికి అక్షరాలు దిద్దుకునే పలక లాంటిది. ఈనాటికి కూడా లేఖిని సృష్టికర్త అనగానే చాలామంది ఆయన ముక్కుమొహం తెలీనివాళ్ళు కూడా “ఆహా! లేఖిని ఉండబట్టే నెట్టింట తెలుగులో రాయడం మొదలుపెట్టగలిగామని” దణ్ణవెట్టుకుంటారు. వీవెన్ అక్కడితో ఆగలేదు, తెలుగు వికీపీడియాలో తెలుగులో రాసే సౌలభ్యాన్ని అమర్చేందుకు వికీపీడియా డెవలపర్లతో కలిసి పనిచేస్తూ, వికీలోనే తెలుగు ఎడిటింగు టూల్సును చేర్చేలా కృషి చేసాడు.

ఇవ్వాళ తెవికీలో రాయాలంటే పద్మ, లేఖిని లాంటి బయటి పరికరాలు అక్కర్లేదు, ఆరేడు రకాల పద్ధతులను వికీలోనే అమర్చారు. అందుకు కృషి చేసినవారిలో వీవెన్ ఒకడు. తెవికీలో యాపిల్ కీబోర్డు లేఔటు లేకపోవడం వలన ఇబ్బంది పడుతున్నాం అన్నారు ఒకరెవరో. ఆ మరుసటి రోజునే ఒక లేఔట్ తయారుచేసి "ఇది పరీక్షించి బాగుందో లేదో చెప్పండి" అన్నాడు

వీవెన్. గట్లుంటది వీవెన్ తోని.

ఆ వీర వెంకట వీవెన్ అలా అలా... వీర లెవెల్లో విజృంభించాడు. అంతర్జాలంలో తెలుగు అన్నాడు. బ్లాగుల కోసం కూడలి అన్నాడు. ఈ-తెలుగన్నాడు, ఆ తెలుగన్నాడు. తెలుగు ఫాంట్లన్నాడు, కీబోర్డులన్నాడు, తప్పొప్పులన్నాడు. కొత్త పదాలన్నాడు. నిషిద్ధాక్షరన్నాడు. లేఖిన్ని తిరగేసి నిఖిలే అన్నాడు. తెలుగోళ్ళ మొహాన ఇంగ్లీషు కొట్టే సంస్థల్ని "#తెలుగులోకావాలి" అన్నాడు. ఇలా వెయ్యిళ్ళకు పూజారయ్యాడు. దాంతో వికీ ఇంట నల్లపూసయ్యాడు.

అన్నట్టు... ఆమధ్య ఒకసారి... "ఇంకా ఈ లేఖిని వాడతారేమిటి, పుస్తకాలు వచ్చినై, కంప్యూటర్లొచ్చినై, ఇంకా ఈ పలక వాడడం ఏమిటి... ఇక తీసేస్తా దీన్ని" అన్నాడు. వెంటనే జనం గద్దించారు, "నువ్వెవరివి లేఖిన్ని తీసెయ్యడానికి, అది నీది కాదు మా అందరిదీ" అన్నారు. సరే సరే అని ఒప్పేసుకున్నాడు వీవెన్.

# సంరక్షకుడు

నిర్వాహకుడిగా, చురుకైన వాడుకరిగా అందరికీ తలలో నాలుక లాగా మెలుగుతూ తెవికీ అభివృద్ధిలో తన ముద్ర వేసిన వాడు కాసుబాబు. 2006 నుండి 2012 వరకు తెవికీలో చాలా చురుగ్గా ఉంటూ విస్తారమైన కృషి చేసారు కాసుబాబు. తెవికీలో పలు విధానాలు మార్గదర్శకాలను ఏర్పరచుకున్న దశ అది. తోటి నిర్వాహకులు వాడుకరులతో కలిసి తెవికీకి ఒక దిశను ఏర్పరచడంలో కాసుబాబు ముఖ్య పాత్ర వహించాడు. వారందరూ వేసిన పునాదుల పైనే ఆ తరువాత తెవికీ భవనం కట్టారు.

వ్యాసాల్లో జరుగుతున్న మార్పులను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేసేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉంటూ నిర్వాహణ చక్కబెట్టేవాడు. ఒక గృహిణి పిల్లల చదువు దగ్గర్నుండి కరెంటు బిల్లులు కట్టేదాకా అన్నీ తానై చూసుకుంటూ, చేసుకుంటూ ఇంటిని ఎలా దిద్దుకుంటుందో వికీని అలా చూసుకునేవారు కాసుబాబు గారు.

అవసరమైనపుడు అనుభవజ్ఞులైన వాడుకరులకు కూడా దిశానిర్దేశం చేస్తూ వ్యాసాలను రూపుదిద్దడంలో పాత్ర పోషించేవారు. మొదటిపేజీలో ముఖ్య భాగమైన ఈ వారం వ్యాసం శీర్షికను ఐదేళ్ళకు పైగా నిర్వహించాడు. ఈ శీర్షికలో ప్రకటించే ముందు ఎంచుకున్న వ్యాసంలో చెయ్యాల్సిన సవరణలను చేసి, సిద్ధం చేసి ఉంచేవాడు.

ఐదేళ్ళుగా నిర్విరామంగా ఈ పని చేస్తూనే ఉన్నారు, అభ్యంతరం లేకపోతే మీరు ఇతర పనుల మీద దృష్టి పెట్టండి, మీకూ మార్పు ఉంటుంది అని ఇతర పెద్దలు ఆప్యాయంగా సలహా వచ్చేంతవరకూ మా కాజ సుధాకరబాబుకు

అలుపు తెలీనే లేదు. ఆ తరువాత వికీ నుండి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్నారు. అప్పుడప్పుడూ తొంగి చూస్తూంటారు - ఏంటి వీళ్ళు సరిగ్గా రాస్తున్నారా లేదా అనుకుంటూ!

# ముదితల్ నేర్వగ లేని విద్యగలదె

తెవికీలో ఒకప్పుడు మహిళలు రాసేవారు కాదు. అప్పుడు సుజాత గారు వచ్చారు. ఆ తరువాత చాన్నాళ్ల పాటు తెవికీలో ఆమె ఒక్కరే మహిళ. ఆ తరువాత విక్షనరీ లోనూ ఆమె ఒక్కరే మహిళ. విక్షనరీలోను, వికీపీడియా లోనూ ఆమె నిర్వాహకురాలు.

వికీలోకి వచ్చీ రాగానే ఆమెకు విక్షనరీ గురించి తెలిసింది, అక్కడికి వెళ్ళారు. విక్షనరీ గురించి తెలుసుకదండీ... స్వేచ్ఛగా వాడుకోగలిగే తెలుగు నిఘంటువు అన్నమాట. సుజాత గారు విక్షనరీని నడిపించడం కాదు, పరుగు పెట్టించారు. పదుల పేజీలను వందల్లోకి తీసుకువెళ్ళారు. వందలను వేలకు చేర్చారు. తాను స్వయంగా 7 వేలకు పైగా పదాలకు పేజీలను సృష్టించారు. 25 వేలకు పైగా దిద్దుబాట్లు చేసారు. విక్షనరీలో నిర్వాహకురాలు కూడాను.

విక్షనరీని హైవే ఎక్కించాక, ఆమె మళ్ళీ వికీపీడియా లోకి వచ్చారు. తెవికీలో ఆమె విరివిగా రాసిన తొలిమహిళే కాదు, ఏకైక నిర్వాహకురాలు కూడా. తెవికీలో అనేక దేశాల వ్యాసాల్లో సమాచారాన్ని నింపినది సుజాత గారే. అనేక దేశాలకు పేజీలు సృష్టించినదీ సుజాత గారే. దేశాలకు సంబంధించిన వందల పేజీల్లో లక్షల బైట్ల సమాచారం చేర్చారామె. అంతేకాదు వందలాది వైష్ణవ దివ్యదేశాలు, మహిళా శాస్త్రవేత్తల వ్యాసాలు రాసారు. వికీప్రాజెక్టులు నిర్వహించేవారు, చురుగ్గా పాల్గొనేవారు. అరకొర సమాచారంతో ఉండే వ్యాసాలు కనబడితే వాటిని పెంచి పెద్ద చేసేదాకా ఊరుకునేవారు కాదు. స్త్రీ సహజ గుణం మరి!

సుజాత గారి మరొక ఘనత, భర్త శ్రీరామమూర్తి గారిని వికీ బరి లోకి దింపడం. సంసార సాగరానికే కాదు విజ్ఞానాంబుధికి కూడా స్త్రీ చుక్కాని కాగలదని నిరూపించారు. నాలుగు చేతులతో వికీని ముందుకు లాక్కెళ్తున్న జంట ఆ దంపతులు.

# సార్

ఏదైనా విషయంపై చర్చ జరుగుతున్నపుడు, చర్చ ఒక దిశలో జరుగుతుండగా ఒక ప్రత్యామ్నాయ దృక్కోణాన్ని చూపించగలవారు కొందరుంటారు. తెవికీలో అలాంటివారిలో కశ్యప్ ఒకరు. అంతర్జాలంలో తెలుగు వ్యాప్తి గురించి అనేక సంవత్సరాలుగా పలువిధాల కృషి చేస్తున్న వ్యక్తి కశ్యప్ గారు. కశ్యప్ గారి మాట ఎంత వేగమో ఆయన చేసే పనులు కూడా అంతే వేగం. ముఖ్యంగా ఔట్‌రీచ్ కార్యక్రమాల్లో ఆయన త్రివిక్రముడి లాగా పనిచేస్తాడు. విజయవాడ, తిరుపతిల్లో తెవికీ ఉత్సవాలు జరిగినపుడు ఆయనే నిర్వాహక సంఘంలో చురుకైన కార్యకర్త, కోశాధికారి. ఈ-తెలుగు సంస్థను స్థాపించిన వారిలో ఆయనొకరు. ఆ సంస్థ తరఫున, పుస్తక ప్రదర్శనలో స్టాల్ పెట్టడంతో సహా పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు వికీపీడియా వ్యాప్తి కోసం కూడా అలాంటి పలు కార్యక్రమాలు చేసారు. తెవికీ ప్రచారం కోసం పుస్తక ప్రదర్శనలో స్టాల్ పెట్టడం అనేది వాటిలో ఒకటి.

ఐఐఐటి సంస్థలో సంబంధిత విభాగంలో పనిచేస్తూ అన్నీ తానై నిర్వహించారు. పలు ఔత్సాహికులకు తెలుగు వికీపీడియాపై అవగాహన కలిగించడం, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం చేసారు. మా వాళ్ళకి శిక్షణ కార్యక్రమం పెట్టాం, మీరు ఒక అంశం తీసుకుని మాట్లాడాలి అంటూ అనుభవజ్ఞులను ఫోన్లోనే ఆజ్ఞాపించగల చనువుంది, చొరవా ఉంది ఆయనకు. కొన్ని డజన్ల మంది ఆయన వద్ద వికీ శిక్షణ పొందారు. ఆయన శిక్షణలో రూపుదిద్దుకుని, తెవికీ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతున్న వికీపీడియన్లు ఉన్నారు. కశ్యప్ సార్ అని వాళ్ళు అతన్ని ఆప్యాయంగా పిలుచుకుంటారు.

# చుక్కాని

తెవికీలో రాసేవాళ్లు చాలామందే ఉంటారు. ఆ రాసేవాళ్ళకు అర్థం కాని సాంకేతికపరమైన చిక్కుముళ్ళను సరిచేసి రహదారి ఏర్పరచేవాళ్ళు కొందరే ఉంటారు. అలాంటివాడు మా అర్జున.

ఇదిగో మనకు ఈ సౌకర్యం కావాలి అని ఎవరైనా రచ్చబండలో రాస్తే అర్జున చప్పున అందుకుంటాడు. ఆ సౌకర్యం కోసం కృషి చేస్తాడు. తెవికీలో ఏదైనా సాంకేతిక సమస్య వస్తే అర్జున ఎక్కడ అంటూ వెతుకుతాం. ఈలోగానే అర్జున సంబంధిత డెవలపర్లతో ఆ సమస్య గురించి మాట్లాడుతూంటాడు. సమస్యను పరిష్కరించేదాకా వెంటపడేవాడు. స్వయంగా సాఫ్టువేరు ఇంజనీరు కాబట్టి ఇలాంటి వ్యవహారాలు ఆయనకు కొట్టినపిండి. వికీడేటా నుండి సమాచారాన్ని ఆటోమాటిగ్గా తేవడం, ఎన్వికీ నుండి దిగుమతులు చేయడం ఇలాంటివి చేస్తాడు.

నిర్వాహకుడికి నిర్వచనం అర్జున... సాధారణంగా వికీపీడియన్లు చేసే కృషిలో సింహభాగం వ్యాసాల్లోనే ఉంటుంది. కానీ, తెరవెనుక చెయ్యాల్సిన కృషి చాలానే ఉంటుంది. అది ఎంత బాగా చేస్తే వికీ వ్యాసాలు అంత పుష్టిగా ఉంటాయి. కొందరు ఈ తెరవెనుక కృషి కూడా చేస్తారు. నిర్వాహకులు ఈ తెరవెనుక పని కొంచెం ఎక్కువగా చేస్తారు. అర్జున అందరికంటే ఎక్కువగా చేస్తాడు. అర్జున చేసిన మొత్తం వికీవ్యవసాయంలో ఈ తెరవెనుక కృషి 60 శాతానికి పైనే ఉంది. మరే నిర్వాహకుడూ తెరవెనుక ఇంత కృషి చెయ్యలేదు.

రేపేంటి అని ఆలోచించే కొద్దిమంది వికీపీడియన్లలో అర్జున ముందుంటాడు. వచ్చేయేడు మన లక్ష్యాలేంటి అని ప్రస్తావిస్తాడు. ఈ యేడు మనం ఏం

చేసాం అని సమీక్షిస్తాడు. తెవికీకి అతనొక చుక్కాని లాంటివాడు.

అంతేకాదు, పది పదిహేను మంది ఒక అభిప్రాయంతో ఉండగా, దానికి వ్యతిరేక అభిప్రాయం చెప్పి ఒక్కడే ఒంటరిగా నిలబడగల స్వతంత్ర ఆలోచనా శక్తి, నిబద్ధత అర్జున సొంతం. ఆయన వికీపీడియా ఇండియా చాప్టరుకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా కూడా పనిచేసాడు.

# ఇన్‌ఫ్లుయెన్సరు

ఆయన వికీపీడియాలో నిర్వాహకుడు, అధికారి. వికీసోర్సులో నిర్వాహకుడు. విక్షనరీలో నిర్వాహకుడు. తెవికీలో 90 వేలు, తెలుగు విక్షనరీలో 30 వేలు, తెలుగు వికీసోర్సులో 57 వేలు, తెలుగు వికీకోట్‌లో వెయ్యి, వికీడేటాలో 20 వేలు, వికీ కామన్సులో 65 వేలు, ఇంగ్లీషు వికీపీడియాలో 40 వేలు, ఇంగ్లీషు విక్షనరీలో 70 వేలు, ఇంగ్లీషు వికీసోర్సులో 40 వేలు - ఉఫ్ఫ్... వెరసి అన్ని రకాల వికీల్లోనూ ఆయన చేసిన మొత్తం దిద్దుబాట్లు నాలుగు లక్షల పైచిలుకు. ఇందులో ఉన్నాడు అందులో లేడు అని అనడానికి లేదు... అన్నింటా ఉన్నాడు చక్రి లాగా! ఇన్ని ప్రాజెక్టుల్లో ఇంత విరివిగా రాసిన ఈ చక్రి ఎవరూ...? ఎవరయ్యా ఎవరు వారు... ఇంకెవరయ్యా రాజశేఖరు!

ఔను, డాక్టర్ రాజశేఖరతడు. సినిమా హీరో కాదు, వికీహీరో! మేం ఆటలను ప్రోత్సహిస్తాం అని తమ ఎడ్వర్టైజ్‌మెంటులో చెబుతూ టాటా స్టీల్ వారు, చివర్న, వియాల్సో మేక్ స్టీల్ అని చెప్పుకునేవారు. అలాగే మనం కూడా డాక్టర్ రాజశేఖర్ గారు తన స్వంత పాథాలజీ ల్యాబును నిర్వహిస్తూంటారు కూడా అని నిరాక్షేపణీయంగా చెప్పవచ్చు. వికీపీడియాలో ఒక్కొక్క హీరోది ఒక్కొక్క పద్ధతి. చిన్నచిన్న అడుగులు, పెద్దపెద్ద విజయాలు అనేది ఈయన పద్ధతి. పద్ధతి ఏదైతేనేం అంతిమ లక్ష్యం వికీ అభివృద్ధే ఐనపుడు!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు కూడా ఈ హీరోను గుర్తించారు, తమ ఉగాది పురస్కారాల ద్వారా! జీవశాస్త్రం, సాహిత్యం వగైరాల మీద వ్యాసాలు రాస్తూంటారు. రాయడమే కాదు, రాయిస్తారు కూడా. వికీలోకి కొత్తగా వచ్చినవాళ్ళకు, వద్దామనుకుంటున్నవాళ్ళకూ ఫోన్లు చేసి రండి రండి, రాయండి రాయండి అంటూ ప్రోత్సహిస్తూ ఉంటారు. వికీలో

కొత్తవాళ్ళు ఎవరైనా రాజశేఖర్ గారికి పరిచయమైతే వాళ్ళు నానాటికీ వికీ ప్రాజెక్టుల ఆకర్షణలో పడిపోతారు. వాళ్ళ ఆసక్తులేమిటో, ఇష్టాలేమిటో, బలాబలాలేమిటో తెలుసుకుని, వాళ్ళకి నచ్చే పనులు వికీలో ఏమేం చేయొచ్చో చెప్పి, చేయించి, భుజం తట్టి, "మీరు సూపర్ సార్", "అద్భుతంగా చేస్తున్నారు మేడం" అని ప్రోత్సహిస్తారు. ఇదంతా అయ్యాకా అవతలి వ్యక్తి హనుమంతుళ్ళా సముద్రాన్ని లంఘించేంత విజృంభిస్తారు.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లంటూ ఇప్పుడు కొత్తగా వస్తున్నారు గానీ... మా డాక్టరు గారు ఎప్పటి నుండో వికీ ఇన్‌ఫ్లుయెన్సరు! జస్ట్... ఆ పేరు మాకు తట్టడం లేటైంది, అంతే! ఆయన మాత్రం అందరికంటే ముందే!

# తెవికీ స్వామి

వికీపీడియా తొలితరం నిర్వాహకుల్లో బి.కె. విశ్వనాథ్ ఒకరు. వికీలో నిర్వహణతో పాటు వికీ బయట నిర్వహించిన కార్యక్రమాలకు విశ్వనాథ్ ప్రసిద్ధి. ఇంటి సంగతి తరువాత ముందు బయట గెలిచి వద్దాం అని వెళ్ళి గెలిచొచ్చిన వీరుడు. వికీపీడియా తరఫున బయట పలు కార్యక్రమాలను నిర్వహించాడు. కవిసమ్మేళనాల్లో, సమావేశాల్లో తల్లావజ్ఝల శివశంకరస్వామి గారు ఎక్కువగా అధ్యక్షుడుగా ఉండేవారట. అంచేత ఆయనను సభాపతి అనేవారు. అలాగే, వికీపీడియా బయట జరిపే కార్యక్రమాలకు విశ్వనాథ్ అధిపతిగా, తలలో నాలుకలా ఉంటూంటారు.

బెజవాడలో పదేళ్ళ దశాబ్ది ఉత్సవాలు జరపినపుడు విశ్వనాథ్, కార్యక్రమ నిర్వహణ బాధ్యతల్లో చాలావరకు తీసుకుని విజయవంతంగా నిర్వహించారు. తిరుపతిలో పదకొండేళ్ళ ఉత్సవం జరిగితే అక్కడా విశ్వనాథ్ ఉన్నారు. అంతేకాదు, చండీగఢ్‌లో జరిగిన వికీకాన్ఫరెన్స్ ఇండియా సదస్సుకు ఇతరులతో పాటు తెలుగు వికీపీడియా తరఫున హాజరయ్యారు. 2022 జనవరిలో భీమవరంలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సంబరాలకూ హాజరయ్యారు. వికీమీడియా ఫౌండేషను నుండి వ్యక్తిగత గ్రాంటు పొంది, గ్రంథాలయాల వికీప్రాజెక్టును నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐదు ప్రముఖ గ్రంథాలయాలకు వెళ్ళి అక్కడి క్యాటలాగులను డిజిటైజు చేసారు. అయితే గత కొన్నేళ్ళుగా వికీ కార్యక్రమాలు తగ్గించేసారు.

# నిర్మోహమైన సేవకుడు

తెలుగు వికీపీడియాలో సాధారణంగా ఎవరూ చెయ్యని పని చేసిన ఒక వ్యక్తి గురించి ఇప్పుడు... ఆయన చేసిన దిద్దుబాట్లను పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది ఎవరికైనా. సాధారణంగా వ్యాసాన్ని మొదలుపెట్టినవారికి "సృష్టికర్త" అనే ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. తెవికీయులు ఇతర పనులతో పాటు, కొత్త వ్యాసాలను సృష్టించేందుకు కూడా ఉత్సాహం చూపుతూంటారు. ఈ ఉత్సాహం అందరికీ ఉంటుంది. ఉండనివారు అరుదు.

కానీ కెపిఆర్ శాస్త్రి గారు ఒక విశిష్టమైన వ్యక్తి. తెవికీలో ఆయన 6 వేల పైచిలుకు దిద్దుబాట్లు చేసారు. వేలాది వ్యాసాల్లో పనిచేసారు. కానీ ఆయన సృష్టించిన పేజీల సంఖ్య ఎంతో తెలుసా? ఒకటి. ఒక్కటే!. కేవలం ఒకే ఒక్క వ్యాసం సృష్టించాడాయన. అంటే ఆయన దిద్దుబాట్లన్నీ ఉన్న వ్యాసాలను మెరుగుపెట్టడం కోసం చేసినవే. తమ పేరిట కొత్త వ్యాసం ఉండాలనే కోరిక ఎంతో కొంత అందరికీ ఉంటుంది. కానీ ఆయనకది ఈషణ్మాత్రం కూడా లేదనేది దీన్ని బట్టి తెలుస్తోంది. చాలా నిర్మోహమైన సేవ మా శాస్త్రిగారిది. మనందరి ధన్యవాదాలకు, అభినందనలకూ పాత్రుడాయన!

శాస్త్రి గారూ... రండి సార్, బోల్డు పనులున్నాయి, అనేక వ్యాసాల్లో తప్పులు సరిదిద్దాలి.

# సున్నితపు త్రాసు

పరుగెత్తి పాలు తాగేవాడు ఉన్నచోటనే నిలబడి నీళ్ళు తాగేవాడూ ఉంటాడు. మధ్యలోనే కాడిపడేసి నిదరోయే కుందేళ్ళున్న చోటనే నెమ్మదిగా నడుస్తూ గమ్యాన్ని చేరే తాబేళ్ళు ఉంటాయి. పదిమంది వాదులాడుకునేచోట సర్దిచెప్పే పెద్దమనిషి ఉండాలి. వివాదాస్పద విషయంపై వాడిగా వేడిగా చర్చలు జరిగేచోట, నిర్మోహమాటంగా నిజం చెప్పే నేర్పరి ఉండాలి, తప్పొప్పులు తేల్చేసే తీర్పరి ఉండాలి. తెవికీలో రవిచంద్ర ఉన్నాడు.

అతనిక్కడ నిర్వాహకుడూ, అధికారీ. చర్చల్లో, నువ్వు చెప్పేది తప్పు అని ముందుకొచ్చి చెప్పగలిగే నిబద్ధత ఉన్నవాడు. తప్పొప్పులను సరిచూసి, ఉచితానుచితాలను త్రాసులో తూచి సరైన నిర్ణయం చెప్పగల మర్యాద రామన్న. తన పొరపాట్లేమైనా ఉంటే ఒప్పేసుకునే గుణం కూడా ఉన్నవాడు. చర్చలలో వచ్చిన అభిప్రాయాల మేరకు తాను చేసిన నిర్ణయాలపై విమర్శలు వచ్చినపుడు కూడా చలించడు. వివాద సందర్భాల్లో, దీనిపై రవిచంద్ర నిర్ణయం చెయ్యాలి అని కోరుకున్న సందర్భం కూడా ఉంది అంటే అర్థం చేసుకోవచ్చు, రవిచంద్ర విశ్వసనీయతను.

నిర్వహణ పనులతో పాటు, వ్యాసకర్తగా అనేక వ్యాసాలు సృష్టించాడు. సినిమాలు, జీవిత చరిత్రలు తదితర అనేక అంశాల్లో వ్యాసాలు రాసాడు. ఆధారాలు ఇస్తూ రాస్తాడు. పదహారేళ్ళుగా తెవికీలో కృషి చేస్తూ ఉన్న వాడుకరికి 12 వందల కొత్త వ్యాసాలంటే తక్కువే. అయితే, దానికి కారణం ఉంది - రవిచంద్ర ఇతరులు సృష్టించిన వ్యాసాలను విస్తరించడానికి, మెరుగుపెట్టడానికీ ప్రాధాన్యత నిస్తాడు. ముఖ్యంగా భాషా దోషాలను పట్టుకోవడంలో అతనిది డేగ చూపు. అతని దిద్దుబాట్లలో 60% కి పైగా

వ్యాసాల మెరుగుదల కోసం చేసినవే. తెవికీ మొదటి పేజీలో ఉండే ఈ వారం వ్యాసం, ఈ వారం బొమ్మ, మీకు తెలుసా వంటి శీర్షికలను నిర్వహించిన ప్రముఖుల్లో రవిచంద్ర ఒకరు. తాను మొదటి పేజీలో ప్రదర్శించడానికి ఎంచుకున్న ఈ వారం వ్యాసంలో దోషాలేమైనా ఉంటే సవరించి మరీ ప్రచురిస్తాడు.

# నిశ్శబ్ద విప్లవకారుడు

స్వరలాసిక గారు స్వయంగా రచయిత, గళ్ళ నుడికట్టును తయారుచేస్తారు, పుస్తక ప్రచురణకర్త, వాట్సాప్‌లో సాహిత్యం గ్రూపులను ఉత్సాహంగా నిర్వహిస్తూంటారు. వీటికి తోడు చురుకైన వికీపీడియన్ కూడా. వికీపీడియన్ అని చివరగా అన్నప్పటికీ.., వడ్డించే పెద్దాయన మావాడే కాబట్టి ఫరవాలేదు. ఆయన తెవికీలో విరివిగా కృషి చేస్తూంటారు. సముద్రం అడుగున నిశ్శబ్దంగా సాగిపోయే జలాంతర్గామి లాగా సద్దు చెయ్యకుండా పనిచేసుకుపోతుంటారు స్వరలాసిక - కొడిహళ్ళి మురళీమోహన్.

జీవితచరిత్ర వ్యాసాలు రాయడంపై ఆయనకు మక్కువ ఎక్కువ. తెవికీలో రచయితలు, సినిమాలు, సంగీతకారులు తదితర వ్యాసాలపై కృషి చేస్తారు. 2 వేలకు పైగా కొత్త వ్యాసాలను తయారు చేసారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలలో 275 మందికి వ్యాసాలు ఉంటే అందులో 200 వ్యాసాలు స్వరలాసిక రాసినవే. ఎస్పి బాలసుబ్రహ్మణ్యం పాడిన వేలాది తెలుగుపాటలన్నిటినీ జాబితా చేసేపనిలో ఉన్నారు. ఇప్పటికి దాదాపు 70 శాతం పని పూర్తైంది. పాటలో తొలి పదాలు, సంవత్సరం, సినిమా, రచయిత, సంగీత దర్శకులు, సహగాయకులు వగైరా సమాచారంతో పుష్టిగా తయారౌతున్నాయి ఈ పేజీలు.

తన కృషిని తనవరకే పరిమితం చెయ్యకుండా సముదాయం మొత్తాన్నీ కూడదీసి ఒక వికీప్రాజెక్టు చేసారు. వికీపీడియా పేజీల్లో ఫొటోలు లేకపోవడం లోటుగా భావించి 2021 లో ఫొటోలు చేర్చే పోటీ పెట్టారు. మెటావికీలో మాట్లాడి ఉత్తమమైన కృషి చేసినవారికి బహుమతులు కూడా ఏర్పాటుచేసారు. పోటీకి మంచి ప్రచారం కల్పించి విజయవంతం చేసారు.

విజయం అంటే మామూలు విజయం కాదది... ప్రాజెక్టులో భాగంగా 30 మంది వాడుకరులు మొత్తం 28 వేలకు పైగా పేజీల్లో బొమ్మలు చేర్చారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన వందలాది వికీపీడియాలతో పోటీపడి, తెవికీని 3వ స్థానంలో నిలబెట్టారు. తెవికీలో అత్యంత విజయవంతమైన వికీప్రాజెక్టుల్లో దీనిది పెద్దపీట.

# జిజ్ఞాసువు

పదిహేనేళ్ళ కిందట తెవికీలో కృషి మొదలుపెట్టిన వ్యక్తి సుల్తాన్ ఖాదర్. తెలుగు సినిమా, గ్రంథాలయాలు, పంజాబ్ ఎడిటథాన్, ఆంధ్రప్రదేశ్‌లో ఇస్లాం వంటి అనేక వికీప్రాజెక్టుల్లో పనిచేసి వికీ అభివృద్ధికి తోడ్పడ్డాడు. సినిమాలు, రాజకీయాలు, జీవితచరిత్రలు వంటి అనేక అంశాలపై రాస్తారు.

వైవిధ్యమైన అంశాలపై వ్యాసాలు రాయడమే కాదు, ఇస్లాముకు సంబంధించిన పలు వ్యాసాలు రాసి తెవికీకి వైవిధ్యం తీసుకువచ్చిన వారిలో సుల్తాన్ ఖాదర్ ఒకరు. మతపరమైన అంశాలపై రాసినప్పటికీ, కొన్ని మత సంబంధ వ్యాసాల్లో వేడిగా చర్చలు జరిగినపుడు ఆ చర్చలకు దూరంగా ఉండి సంయమనం పాటించాడు, సుల్తాన్ ఖాదర్. బహుశా, తెవికీ అనేది విస్తృతమైన విజ్ఞాన సర్వస్వం అనే భావన పట్ల ఆయన కున్న నిబద్ధత అందుకు కారణం తప్ప మరొకటి అయి ఉండే అవకాశం లేదు. చర్చల్లో సౌమరస్యం, వివాదాస్పద అంశాలపై సంయమనంతో రాయడం సుల్తాన్ ఖాదర్ విశిష్టత. సహజంగానే 2014 లో ఆయనకు కొమర్రాజు లక్ష్మణరావు పురస్కారం వచ్చింది.

సుల్తాన్ ఖాదర్ వలన ఇతర వికీపీడియన్లకు ఒక పెద్ద ప్రయోజనం ఉంది. తనకు తెలీని సంగతుల గురించి ఊరుకోరాయన, చర్చ లేవదీస్తారు. దానివలన ఆయనతో పాటు ఆనేకమంది ఇతరులకు కూడా దాని గురించిన సమాచారం తెలుస్తుంది. ఆ విధంగా ఆయన జిజ్ఞాస వలన అనేకసార్లు జ్ఞానవితరణ జరిగింది.

# ఆతడనేక వికీ కార్యక్రమముల...

ఆతడనేక వికీ కార్యక్రమముల నారియుతేరిన వికీమూర్తి. వికీ బయట కార్యక్రమాలు నిర్వహించిన తెవికీపీడియన్లలో రహ్మానుద్దీన్ ముందు వరుసలో ఉంటారు. ఒకప్పుడు సిఐఎస్‌లో పనిచేస్తూ వికీపీడియాతో కలిసి పలు ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శనల్లో తెవికీ స్టాళ్ళు నిర్వహించారు. తెవికీ ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్నారు.

తెలుగు ప్రాంతాల్లో తెవికీ కాడి భుజాన వేసుకుని విస్తారంగా తిరిగిన కొద్దిమందిలో రహ్మానుద్దీన్ ఒకరు. బరంపురం నుంచి బళ్ళారి దాకా, తంజావూరు ఆవల నుంచి ఆదిలాబాదు పైపైవరకూ ఎన్నెన్నిచోట్లకి వెళ్ళి ఎందరు తెలుగు రచయితలను, సంస్థలను కలిశారో ఆయనకే తెలియాలి. సహజంగానే తెలుగు పట్ల తనకున్న అనురక్తి, తెలుగులో విజ్ఞానమూ, రచనలూ పెరగాలన్న ఉద్యమంతో మమేకమూ ఉండడంతో తెవికీతో పాటు భాషోద్యమంలోని ఇతర ప్రయత్నాల్లో తనకు భాగం ఉంది. తెలుగులో పిల్లలు చదువుకోదగ్గ సైన్స్ పుస్తకాలు రాయడం నుంచి పుస్తక మహోత్సవాల నిర్వహణా సహకారం వరకూ రకరకాల కార్యకలాపాలు చేపట్టినవారు.

తెవికీలో వికీపీడియా ఏషియన్ నెల వంటి పలు వికీప్రాజెక్టులను నిర్వహించారు. తెవికీతో పాటు, వికీడేటా, వికీసోర్సు, కామన్సుల్లో కూడా చురుగ్గా ఉండేవారు. 2021 నుండి తెవికీలో అంతగా చురుగ్గా లేరు.

# సైన్సు మాస్టారు

పాలగిరి రామకృష్ణారెడ్డి గారిది సైన్సు సాంకేతిక నేపథ్యం. ఆ రంగంలో ఉన్నత ఉద్యోగంచేసారు. ఆ నేపథ్యం నుండి తెవికీకి వచ్చారు. తన రంగానికి సంబంధించి అనేక వ్యాసాలు రాస్తూనే ఇతర రంగాలకు సంబంధించిన వ్యాసాలు కూడా రాసారు. నూనెలు, రాకెట్లు, ఉపగ్రహాలు, సాహిత్యం మొదలైనవాటి మీద అనేక వ్యాసాలు రాసారు.

ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో ఉండే సమాచారమంతా ఇంగ్లీషు లోనే ఉంటుంది. పాలగిరి గారు పనిచేసే ఆయిల్ టెక్నాలజీ రంగం కూడా అంతే. కానీ ఆ రంగంలో పనిచేసేవాళ్లలో సింహభాగం ఇంగ్లీషు రానివాళ్ళు. వారి సౌలభ్యం కోసం ఆయా సాంకేతిక విషయాలను తెలుగులో రాసి వాళ్ళకు ఇస్తూండేవారు. కొందరి కోసం మొదలైన ఆ అలవాటును అందరి కోసం తెవికీ లోకి పట్టుకొచ్చారు. అనేక సైన్సు, సాంకేతిక విషయాలపై వ్యాసాలు రాసారు. అనేక వ్యాసాలను విస్తరించారు.

తెలుగు లోనే కాదు, కన్నడ వికీపీడియాలో కూడా విస్తారంగా రాసారు. తెలుగు విక్షనరీ, తెలుగు వికీసోర్సు, కన్నడ విక్షనరీ, ఇంగ్లీషు వికీపీడియాల్లో కూడా కృషి చేసారు. అది కూడా ఎంత చక్కగా అంటే – ఆయన కృషి తెలిసిన కన్నడ వికీపీడియన్లు మాతో "మీ పాలగిరి మావాడు" అనేంతలా. ఒక సందర్భంలో ఒక వ్యాసం విషయంలో ఆయనకు మరొక వికీపీడియనుతో చర్చ కొంచెం వేడిగా జరిగింది. అది ముగిసాక కొన్నాళ్ళకు, పాలగిరి గారు ఆ వికీపీడియను ఇంటికివెళ్ళి ఆయన్ను కలిసి వచ్చారు. అదీ పాలగిరి గారి వ్యక్తిత్వ విశేషం.

2019 నుండి పాలగిరి గారు వికీలో కృషిని బాగా తగ్గించేసారు. అయితే అయనే రాయాల్సిన వ్యాసాలు ఇంకా బోలెడున్నాయి. ఆ సంగతి తెవికీకి తెలుసు. ఆ వ్యాస శీర్షికలకూ తెలుసు. ఆయనకి తెలుసో లేదో మరి!

# బృహస్పతి

పద్యాలు రాసే పంతులు గారు మా వెంకటరమణ. తెలుగు పంతులు గారు కాదు సుమా... ఫిజిక్సు మేష్టారు. ఓహో సైన్సు వ్యాసాలు రాస్తాడు గామాలు అని అనుకునేరు... చరిత్ర, ఆటలు, రాజకీయాలు, సంస్కృతి... అన్నీ రాస్తాడు. కాదేదీ రమణకనర్హం! రాసిలో పెద్దగా, వాసిలో ఉన్నతంగా, తోటి వారితో మర్యాదగా, చర్చల్లో నిర్ణయాత్మకంగా, నిర్ణయాల్లో నిర్మోహమాటంగా ఉంటాడు మా రమణ. ముక్కు పట్టుకుని తానున్న బిందువు వద్ద బైల్దేరి భూమి చుట్టూ తిరిగి వస్తే ఖచ్చితంగా బైల్దేరిన అదే బిందువు వద్దకు చేరుకునేంతటి సూటి మనిషి మా రమణ. తెవికీలో నియమం, నిబంధన, విధానం, మార్గదర్శకం - ఇవి మాత్రమే ఉంటాయని ఈ మనిషి ఉద్దేశం.

తెవికీ సౌర వ్యవస్థలో గురుగ్రహం (బృహస్పతి) అతను. అతని ఆకర్షణ లోకి వచ్చిన తెవికీయులు అతనిచ్చిన జ్ఞానం అనే గురుత్వాకర్షక స్లింగ్‌షాట్‌తో ఒక్కసారిగా పెనువేగం పుంజుకుంటారు. వ్యాసాల్లో రచనలు చెయ్యడమే కాదు, తెవికీ నిర్వహణలో చాలా చురుగ్గా ఉండే నిర్వాహకుడు రమణ మేష్టారు. నిర్వహణలో ఇతర నిర్వాహకులకు మార్గదర్శకుడు. తప్పులని భరించే సహనం ఆయనకి లేదు, వాటిని సరిదిద్దే ఓపిక మాత్రం పుష్కలంగా ఉంది. ఇతర వాడుకరులు తొలగించాలని ప్రతిపాదించిన వ్యాసాలలో అవసరమైన సవరణలు చేసి, అనేక వ్యాసాలను కాపాడినవాడు రమణ సార్. "నేను రాసిన వ్యాసాలలో తప్పులు పట్టేంత మొనగాడివా" అని హుంకరించినవారికి దండం పెట్టి, ఆ తప్పేమిటో వివరించి, వారి చేతనే "అవును మాస్టారూ, తప్పే" అని ఒప్పించగల సహనశీలి, సమర్థుడు. బయట ఎవరినీ కలవని సిగ్గరి. తెవికీలో మాత్రం కలుపుగోలుగా పనిచేసే నేర్పరి. దోషాలను చాకచక్యంగా వివరిస్తాడు. వాటిని తానే సవరించి

ఆదర్శంగా నిలుస్తాడు. విచక్షణా రహితంగా వికీలింకులు ఇస్తున్నవారి పట్ల రమణ మాస్టారు వెలిబుచ్చిన ధర్మాగ్రహం చూడండి:

అగ్గిపుల్ల నందు అగ్గి, పుల్లకు నిచ్చు
చెరకు కిచ్చు వంటచెరకు నందు
లింకులిచ్చువారి లీలలు చూడరా
లుప్తమయ్యె పదము లింకులందు

# క్షేత్రపాలకుడు

యర్రా రామారావు గారు ఎక్కడుంటారండీ? మొన్నటిదాకా ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారండి. నిన్నటి నుంచీ తెవికీలో ఉంటున్నారండి. ఇప్పుడెక్కడున్నారండీ? ఇప్పుడే కాదు, ఎప్పుడూ అక్కడే ఉంటారండి.

ప్రజలు గ్రామంలో నివసిస్తారు, మా రామారావు గారు గ్రామం పేజీలో నివసిస్తారు.

గ్రామం నుండి మండలం దాకా, ఆపై జిల్లా దాకా - తెవికీలో గ్రామాల పేజీలను సమాచార భరితం చేసిన అతి కొద్దిమందిలో రామారావు గారు అగ్రగణ్యుడు. కుండపోతగా వానలొచ్చి తెప్పలుగా ఊరి చెరువు నిండినట్టు, రామారావు గారు కురిపించిన సమాచార వర్షాలతో ఊళ్ళ పేజీలు నిండిపోయాయి. ఆంధ్ర తెలంగాణల్లో ఏ గ్రామం ఏ జిల్లాలో/ఏ మండలంలో ఉంది, కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు ఎక్కడ ఉండేది, దాని భౌగోళిక మ్యాపు ఏమిటీ... ఇలాంటి సమాచారం తెవికీలో దొరికినంతగా మరెక్కడా - ఒకే చోట - దొరకదు. దీని కోసం ప్రత్యేకంగా ఒక వికీప్రాజెక్టును సృష్టించి, ఒక ప్రణాళిక వేసి, సమాచారం చేర్చేదుకు కృషి చేసి సాకారం చేసిన కొద్దిమంది తెవికీయుల సమూహానికి మా రామారావు గారు గ్యాంగులీడరు.

ప్రభుత్వ ఉద్యోగంలో రిటైరై, అరవై ఏళ్ళ వయసులో కంప్యూటరు పట్టి, తెవికీలో దూకి, లక్షల్లో దిద్దుబాట్లూ కోట్లలో బైట్లూ చేర్చగలిగిన సమర్థత, పట్టుదల రామారావు గారిది. వయసులో పెద్దవారైనా, తన మనవళ్ళ వయసున్న కుర్రాళ్ళ దగ్గర వినయంగా చేతులు కట్టుకుని నేర్చుకోడానికి వెనకాడని జిజ్ఞాసువు.

ఆయన జ్ఞానదాహం తెవికీకి వరమైంది. ఆయన నిర్వాహకుడయ్యాడు. లోపాలను అసలే సహించలేని చండామార్కుడతడు. ఎవరెవరు ఏయే మార్పులు చేసారు, ఎవరు దుశ్చర్యలు చేసారు... వగైరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తప్పులను సవరిస్తూ దుష్టులను దండిస్తూ ఉండే దండనాయకుడు. తెవికీ క్షేత్రపాలకుడు.

# పీఠాధిపతి

తెవికీలో రోజు కొక వ్యాసం రాయడం ఒక ఆరోహణ. రోజుకో వ్యాసం చొప్పున వందరోజుల్లో వంద వ్యాసాలు అనే పోటీ ఒకటి వికీలో ప్రపంచ వ్యాప్తంగా పెట్టారు. ఈ వంద రోజుల స్ప్రింట్ ఈవెంటును అవలీలగా పరుగెత్తారు మనవాళ్ళు. అయితే, మా ప్రణయ్ రాజ్ మాత్రం ఇది స్ప్రింట్ కాదు మారథాన్ అన్నాడు. ముందు 365 రోజుల మారథాన్ అన్నాడు. ఆ తరవాత వెయ్యి రోజుల మారథాన్ అన్నాడు. కాదుకాదు ఐదేళ్ళన్నాడు. ఇప్పటికి ఏడేళ్ళైంది. తెగకుండా రోజుకు కనీసం ఒక్క వ్యాసమైనా రాస్తూనే ఉన్నాడు.

రోజుకో వ్యాసం వ్యసనాన్ని అనేకమందికి అంటించిన ఈ ప్రమాదకారి, తెలుగు వికీపీడియా లోనే కాదు యావత్తు వికీమీడియా ప్రపంచం లోనే ఎత్తాటి పీట వేసుకుని కూచున్నాడు. ప్రపంచం గుర్తించిన తన బిడ్డను తెలుగు వికీపీడియా గుర్తించకుండా ఉంటుందా... అతని గురించి ఒక వ్యాసం రాయించుకుంది. 5,800 పైచిలుకు వ్యాసాలు రాసాడు ఇప్పటిదాకా. తెవికీలో ఉన్న మొత్తం వ్యాసాలు 90 వేల లోపు. 6% ఈ ఒక్క మనిషే రాశాడు!

ప్రవృత్తితో జీవితం పెనవేసుకుపోయిన ప్రణయ్ లాంటి వాళ్ళు అరుదుగా ఉంటారు. పెళ్ళీ పేరంటాలు, రాత్రీ పగలూ, ఎండా వానా, పండగా పబ్బం ఏమొచ్చినా సరే... ఈ తెవికీ యజ్ఞం ఆగదు. ఈ యజ్ఞకర్త ఆగడు. వార్తా పత్రికల్లో తెవికీ కనబడినపుడల్లా ప్రణయ్ కనబడడం మామూలు. మామూలే కాదు సహజం కూడా. సహజమే కాదు, సమర్థనీయం కూడా. సమర్థనీయమే కాదు ఆవశ్యకం కూడా.

తెలుగు వికీపీడియా తరఫున ఇటలీలో అంతర్జాతీయ వికీమానియా ఉత్సవంలో పాల్గొన్నాడు. తెవికీలో చేస్తున్న కృషికి గాను, తెలంగాణ ప్రభుత్వం నుండి బహుమానం అందుకున్నాడు. ఓ పక్కన వ్యాసాలు రాస్తూనే మరో పక్క వికీ పరిపాలన కూడా చేస్తూంటాడు. దుష్ట శిక్షణ చేసేందుకు వెనకాడని నిర్వాహకుడు మా ప్రణయ్ బాబు.

# స్ఫూర్తికి సోర్సు, సోర్సుకు స్ఫూర్తి

వికీసోర్సు గురించి మీకు తెలుసుగదా... కాపీహక్కులు ముగిసిన ప్రముఖ పుస్తకాలను ఉన్నదున్నట్టుగా ప్రతీ ఒక్క పేజీనీ టైపు చేసి వికీసోర్సులో పెడతారు. తద్వారా ఎవరైనా స్వేచ్ఛగా ఆ పుస్తకం చదూకోవచ్చు. "టైపు చెయ్యడం ఎందుకూ... సుబ్బరంగా పుస్తకాన్ని పీడీయెఫ్ చేసి పెట్టెయ్యొచ్చు గదా అని మీరు అనొచ్చు". "మరి గూగుల్ వెతుకులాటలో పీడియెఫ్‌లు దొరకవు గదా. దొరికినా వాటిలోని పాఠ్యాన్ని కాపీ చేసుకోవాలంటే వీలు కాదు గదా!" అని వికీసోర్సు జవాబిస్తుంది. "మరి టైపు చేసేటపుడు బోల్డన్ని తప్పులు దొర్లుతాయి గదా" అని మళ్ళీ మీరు అడుగుతారు. "ఎలా దొర్లుతాయ్... మాకు మా శ్రీరామమూర్తి గారున్నారు గదా!" అంటామ్మేము.

ఆయన ఎవరని అంటున్నారా... శ్రీరామమూర్తి గారిని తెలుగువికీ లోకి ఆయన భార్య తీసుకొచ్చారు. ఆయన్ని తీసుకు రావడం వరకే సుజాత గారి పని. ఆ తరువాత ఆయన వికీని అల్లుకు పోయారు. సుజాత గారు తెవికీని, విక్షనరీనీ సొంతం చేసుకుంటే, శ్రీరామమూర్తి గారు వికీసోర్సు నాదన్నారు. సర్లే అది మీదేలే సార్ అని ఒప్పేసుకున్నారందరూ. తప్పదు మరి, ఆయన చేసిన కృషి అటువంటిది.

వికీసోర్సులో ఒకరు టైపు చేసిన పేజీని మరొకరు తప్పులు సరిదిద్దుతారు. అప్పుడు దాన్ని ఇంకొకరు మళ్ళీ సరిచూసి "వాకే బాగుంది, పేజీ ఇక సిద్ధం" అంటారు. ఆ మరొకరూ, ఈ ఇంకొకరూ... అందరూ కూడా శ్రీరామమూర్తి గారు టైపించిన పేజీలను సరిచేసేందుకే ఆసక్తి చూపుతారు. ఎందుకో తెలిసిపోయిందా... ఔను మరి, ఎక్కడో అడపా దడపా అర కొర తప్పులు

దొర్లితే సరిదిద్దడం బహు వీజీ గదండీ!

అదీ మా రామమూర్తి గారి గొప్పదనం. “తెలుగున టైపించుటయందు రామమూర్తికిన్ రెండవసాటి వికీమీడియను లేడనుచున్ గడకట్టి భేరికా డాండడ డాండ డాండ...”

# మెగామీడియన్

వికీలో విధానాలు మార్గదర్శకాల పట్ల సందేహాలున్నాయా? వికీలో కాపీహక్కుల గురించి డౌటా? వికీమీడియా వారి గ్రాంటులు పొందడంలో ఇబ్బంది పడుతున్నారా? జనానికి తెవికీని పరిచయం చేసే ఔట్‌రీచ్ కార్యక్రమం పెట్టాలా? అన్నిటికీ ఒకటే అడ్రసు - పవన్ సంతోష్. కాలేజీల్లో ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు వికీపీడియాను పరిచయం చేసినా, మహిళలకు ప్రత్యేకించి తెవికీ శిక్షణ కార్యక్రమం పెట్టినా, సిఐఎస్ తరఫున శిక్షకులకు శిక్షణ ఇచ్చినా, అన్నిటి లోనూ పవన్ మార్కు వ్యూహం, ప్రణాళిక, ఫినెస్ ఉంటాయి. తెవికీలో ఇప్పుడు విరివిగా రాస్తూ అగ్రస్థానాల్లో ఉన్న కొందరు వికీపీడియన్లకు శిక్షణ నిచ్చి, వాళ్ళకు వికీ వ్యసనం మప్పిన వ్యక్తి పవనే. వికీల అభివృద్ధికి తోడ్పడుతున్న వికీమీడియన్ల అభివృద్ధికి తోడ్పడుతున్న వికీమీడియన్ అతను - మెటామీడియన్ అతను. మెగామీడియన్!

ఇంటా బయటా, వికీమీడియా ప్రాజెక్టుల లోనూ ఔట్‌రీచ్ లోనూ విశేషంగా కృషి చేసిన పవన్ వంటి వికీమీడియన్లు అరుదుగా ఉంటారు. ఇతర భాషల ప్రాజెక్టుల లోనూ, మెటా లోనూ, వికీ బ్లాగు "డిఫ్" లోనూ తెలుగు వికీమీడియా వాణిని వినిపిస్తూంటాడు. వీటికీ తోడు పుస్తకాలు రాస్తూంటాడు. యూట్యూబరు కూడా. మాతో పనిచెయ్యంటూ సిఐఎస్ వాళ్ళు అతన్ని తీసుకున్నారు. అతని రోజులో 25 గంటలుంటాయని వాళ్ళక్కూడా తెలిసిపోయినట్లుంది.

చక్కటి భాషలో, సమాచార భరితంగా ఉంటాయి పవన్ వ్యాసాలు. వివాదాస్పద విషయాలను కూడా పటిష్టమైన ఆధారాలతో వివాదానికి

ఆస్కారం లేకుండా రాస్తాడు. అదీ పవన్ పవర్. మంచి వ్యాసం ఎలా ఉండాలి అనే దానికి తెవికీలో ప్రమాణాలు స్థాపించాడు. 2016 ఏప్రిల్ లోనే వంద రోజులు వంద వ్యాసాలు లక్ష్యాన్ని చేరుకుని తెవికీలో ఆ బీజాన్ని నాటాడు. ఆ తరువాత అది అల్లుకుని పది మందికీ అంటుకుంది.

మామూలుగా మలయమారుతం లాగా హాయిగానే వీస్తూంటాడు పవన్. నిర్వాహకత్వ బాధ్యతల్లో భాగంగా దుశ్చర్యలను ఎదుర్కొనేటపుడు, అవసరమైతే వడగాడుపూ కాగలడు. 2023 లో వికీ కాన్ఫరెన్సు, 2024 లో తెవికీ పండగ జరిగినపుడు పవనే ముందు ఉన్నాడు. ముందు ముందు జరిగే పండగలకూ ముందుంటాడు. 2021 ఫౌండేషను బోర్డు ఎన్నికలలో పోటీ చేసాడు.

తెలుగు వికీపీడియా తరఫున ప్రపంచానికి రాయబారి పవన్ సంతోష్.

# అనువాదానికి ఆది గురువు

వికీపీడియాలో మంచి కృషి చేసిన మహిళా వికీపీడియన్లలో మీనా గాయత్రి ఒకరు. 2014 నుండి 2018 వరకు విస్తృతంగా రాసారు. వికీపీడియా అనువాద పరికరాన్ని విస్తృతంగా వినియోగించి తెవికీలో వ్యాసాలను ప్రచురించిన తొలి వికీపీడియన్ ఈమె. 2018 వరకు వికీపీడియా అనువాద పరికరాన్ని వాడి సృష్టించిన మొత్తం అనువాదాల్లో మూడో వంతు ఆమె సృష్టించినవే అంటే ఆమె చేసిన కృషిని అర్థం చేసుకోవచ్చు. యంత్రాలు అనువదించిన వ్యాసాల్లో లోపభూయిష్టంగా ఉండే భాషను చక్కగా సరిదిద్ది, తేటైన తెలుగులో ప్రచురించేవారు.

చర్చల్లో కూడా చురుగ్గా పాల్గొనేవారామె. ఎప్పుడో 2011 లో గూగుల్ ద్వారా అవకతవకలుగా అనువదించి ప్రచురించిన వ్యాసాల్లో భాష దారుణంగా ఉందనీ, వాటిని తొలగించాలనీ 2016 లో సముదాయం భావించింది. కానీ మీనా గాయత్రి ఒప్పుకోలేదు. అందరం కలిసి వాటిని సవరించుదాం అని అన్నారు. యావత్తు సముదాయమూ ఒకవైపు ఆమె ఒక్కరే ఒకవైపు! అయినా ఆమె నిలబడ్డారు. అట్నుంచి కొట్టుకురండి అంటూ ఆమె చేసిన వాదనను ఆ రోజున సముదాయంలో ఎవరూ వ్యతిరేకించలేక పోయారు. ఆ తరువాత ఆ వ్యాసాల్లో కొన్నిటిని ఆమె సవరించారు కూడా.

2016లో వంద రోజులు వంద వ్యాసాలు లక్ష్యాన్ని చేరుకుని తెవికీలో అది సాధించిన తొలి మహిళ అయ్యారు. అంతే కాదు, మరుసటి ఏడాది ప్రపంచ మహిళల మాసంలో (మార్చి) వందరోజులు వంద మహిళల బయోగ్రఫీలు రాసే “100 వికీ విమన్స్ డేస్” సవాలు చేపట్టి విజయవంతంగా పూర్తిచేశారు.

2018లో తెవికీ కృషికి కామా పెట్టి స్వంత పనుల్లో మునిగిపోయారు. అది కామా యేనని, చుక్క కాదనీ అప్పుడప్పుడూ ఆమెకు గుర్తు చెయ్యడానికి తెవికీ తరఫున ఒక మనిషి పని చేస్తూ ఉన్నారు.

# లాస్టు కాదు లేటెస్టు

యూనివర్సిటీలో ఉద్యోగం నుండి రిటైరయ్యాక తెవికీలోకి వచ్చారు సుశీల గారు. 40 యేళ్ళ లైబ్రరీ ఉద్యోగానుభవాన్ని, దాదాపు 130 పరిశోధనా వ్యాసాల పరిణతినీ వెంటతీసుకు వచ్చారామె. దాంతో పాటు ఒక పాజిటివ్ ఎనర్జీని, ఒక కొత్త ఉత్సాహాన్నీ తీసుకొచ్చారు. వికీమీడియా ప్రాజెక్టుల్లో ఆమె చేస్తున్న కృషిని చూస్తే, అరెరె వికీ గురించి చాలా ఆలస్యంగా తెలుసుకున్నానే..., సరే ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు, ఇక వీటి సంగతి చూద్దాం అని నిశ్చయించుకున్నట్లు కనబడుతుంది. తెవికీతో పాటు, విక్షనరీ, వికీసోర్సు, వికీకోట్, వికీడేటా, ఎన్వికీ, కామన్సు, లింగా లిబ్రే... ఇలా అన్నిటిలోనూ కృషి చేయడం మొదలు పెట్టారు. క్రికెట్ 2023, విశాఖపట్నం వంటి వికీప్రాజెక్టుల్లో ఉత్సాహంగా పాల్గొని అనేక వ్యాసాలు రాసారు.

కాకతాళీయమో, ఆమె ప్రభావమో గానీ..., ఆమె వచ్చాక తెవికీలో మహిళల ప్రాతినిధ్యంలో పెరుగుదల కనిపించింది. తాను ముందుండి తోటివారిని ఉత్సాహపరుస్తూ ముందుకు సాగుతారామె. వికీల్లో కృషి మాత్రమే కాదు, వికీ బయట జరిగే కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకుంటారు. వికీకాన్ఫరెన్స్ ఇండియా, వికి విమెన్స్ క్యాంప్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాల్గొనడమే కాదు, అక్కడ ప్రెజెంటేషన్లు కూడా ఇచ్చారు. వికీబ్లాగు, డిఫ్‌లో కూడా రాసారు. తెవికీ తరఫున బయట కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్న వారిలో ఆమె ఒకరు. ఇన్ని చేస్తూ కూడా ఏమీ తెలియనట్లుగా ఉంటారామె - అన్నీ ఉన్న విస్తరిలాగ.

వందకు పైబడిన పరిశోధనా వ్యాసాలను ప్రచురించిన వ్యక్తి తెవికీలో ఉండడం మాకు గర్వకారణం. ఆమె తెవికీలో ఒక పదేళ్ళు ముందు చేరి ఉంటే తెవికీ ఒక పదేళ్ళు ముందు ఉండి ఉండేది.

# వాసి >>> రాసి

ఇప్పటివరకు తెవికీ వ్యాసాలకు లబ్ధ ప్రతిష్టులైన వారి నుండి బహిరంగ ప్రశంసలు పొందిన వ్యాసం ఒకటే ఉంది. అది మాలపల్లి నవల గురించి వచ్చిన వ్యాసం. ఆ ప్రశంస ఇచ్చినది వాడ్రేవు చినవీరభద్రుడు గారు. పొందినది వుక్కుం మహేష్ కుమార్ గారు. ఆ వ్యాసాన్ని మొదలుపెట్టినది వేరేవారైనప్పటికీ అందులో సింహభాగం రాసినది మహేష్ గారే. అదే కాదు ఆయన రాసిన ఏ వ్యాసమైనా ఉత్తమ స్థాయిలోనే ఉంటుంది.

చిన్న చిన్న దిద్దుబాట్లు చేస్తూ కొద్దికొద్దిగా సమాచారం చేరుస్తూ వ్యాసాన్ని నిర్మిస్తారాయన. బౌద్ధ సంబంధ వ్యాసాలు, ప్రాచీన యాత్రికులు, చారిత్రికులు, జియాలజీ, పుస్తకాలు మొదలైన అంశాలపై వ్యాసాలు రాస్తారు. రాసేది ఏ వ్యాసమైనా చాలా సమగ్రంగా తీర్చిదిద్దడం ఆయన విశిష్టత. మొలకలుగానో, అసమగ్రంగానో రాయడం ఆయన పద్ధతి కాదు.

వ్యాసాలు రాయడంతో సరిపెట్టకుండా, తెవికీలో చర్చా ధోరణులను, పద్ధతులనూ సంస్కరించాలని కూడా సంకల్పించారు. కొంత పని కూడా చేసారు. చర్చల్లో చాలా విపులంగా, విశ్లేషణాత్మకంగా రాస్తారు.

# తెవికీసోర్సు రాయంచ

స్ఫుటమైన వ్యక్తిత్వం, కచ్చితమైన అభిప్రాయాలు, లక్ష్యాలు ఉన్నవారు గుంటుపల్లి రామేశం గారు. అలాంటి లక్ష్యాల్లో కొన్ని - మరుగున పడుతున్న ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావాలన్నది ఒకటి. ఆ లక్ష్యమే ఆయనకు తెలుగు వికీసోర్సులో విస్తృతంగా పనిచేసేందుకు ఇంధనం.

తెలుగు వికీసోర్సు ఒక గ్రంథాలయం. కాపీహక్కుల పరిధిలో లేనివీ, ఎవరినీ అనుమతి అడగక్కరలేకుండా ఎవరైనా పంచుకోదగ్గవీ అయితే చాలు ఏ తెలుగు పుస్తకమైనా అప్‌లోడ్ చేసి, టైప్ చేసి అందుబాటులోకి తేవచ్చు. అయితే, రామేశం గారు అలా ఏ పుస్తకం మీదైనా పనిచేసేసే వ్యక్తి కాదు. ఆయన పుస్తకాన్ని ఎంచుకున్నారంటే దానికి ఎన్నో ప్రత్యేకతలు ఉండాల్సిందే.

ఉదాహరణకు కట్టా వరదరాజ కవి రచించిన ద్విపద రామాయణాన్ని ఆయన తెవికీసోర్సులో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేశారు. అసలు ఏమిటీ ఈ పుస్తకం అని చూస్తే - వాల్మీకి రామాయణ మూలాన్ని దగ్గరగా అనుసరిస్తూ రచించిన మొట్టమొదటి తెలుగు ద్విపద రామాయణం ఇది. కృష్ణదేవరాయల తదుపరి కాలానికి చెందినవారు ఆ కట్టా వరదరాజ కవి. ఆ రచన తర్వాతి కాలంలో విస్మృతిలో పడిపోయి ఒకే ఒక్క తాళపత్రం ఎక్కడో తంజావూరు సరస్వతీ మహల్లో ఉంటే నిడుదవోలు వెంకటరావు గారు 1950ల్లో పరిష్కరించి, ప్రచురించి తిరిగి వెలుగులోకి తెచ్చారు. అదిగో - అలాంటి అరుదైన, విలువైన రచనను ఎంపికచేసుకుని తెలుగు వికీసోర్సు ద్వారా టైపుచేసి, దిద్ది ఇప్పుడు అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చినవారు మన రామేశం గారు.

వాశిష్ఠ గణపతి ముని విరచిత ఇంద్రాణీ సప్తశతి, వీరేశలింగం పంతులు రాసిన ఆంధ్ర కవుల చరిత్రము, చిలకమర్తి లక్ష్మీనరసింహము రచించిన మహాపురుషుల జీవితములు, పింగళి సూరన ప్రణీత కళాపూర్ణోదయము, గణపవరపు వెంకటకవి కృత శ్రీ ప్రబంధరాజ వెంకటేశ్వర విలాసము - ఇలా ఏ రచన తీసుకుని పనిచేసినా దాని వెనుక ఆయనకంటూ ఒక ఆలోచన ఉంటుంది. తనకు మంచివని తోచిన పూలను వెతికి వెతికి ఇష్టంగా కష్టపడి గుదిగుచ్చి భగవంతునికి భక్తుడు సమర్పించినట్టు అరుదైన, విలువైన, చక్కని సాహిత్య సంపదను ఎంపికచేసుకుని తెలుగు వికీసోర్సులో పెంపొందిస్తున్న గ్రంథమాలి మా గుంటుపల్లి రామేశం.

# సమాచార సేతువు

కుటుంబసభ్యుల మధ్య అభిరుచులు, ఆసక్తులు, నైపుణ్యాలూ కలవాలని ఏమీ లేదు. చాలాసార్లు కలవవు కూడాను. అందుకే వికీలో ఒక వ్యక్తి కృషిచేస్తుంటే కుటుంబసభ్యులు వారిని ప్రోత్సహించడమే తప్ప తామూ నేరుగా వచ్చి కలసి పనిచేయడం తక్కువ. అందుకు మినహాయింపుగా నిలచే కొద్దిమందిలో ఎ.మురళీ గారొకరు. తెలుగులో వికీపీడియా, వికీసోర్సు, విక్షనరీ వంటి ప్రాజెక్టులన్నిటిలోనూ గట్టిగా పనిచేస్తున్న రాజశేఖర్ గారు ఈయన తమ్ముడే. రాజశేఖర్ గారు వికీలోకి వచ్చిన దశాబ్దానికి ఎందుకో ఏ విధంగానో తన అన్నగారి మనసులో కూడా తెవికీలో కృషిచేయాలన్న ఆలోచన విజయవంతంగా నాటారు. నారుపోసినవాడే నీరూ పోశాడు. అంతే, ఆ అత్యంత వేగంగా మహావృక్షంగా ఎదిగి తెలుగు వికీసోర్సులో మధురమైన ఫలాలను అందిస్తోంది.

తెవికీసోర్సులో పుస్తకాల మీద క్రమంతప్పక కృషిచేస్తున్న కొద్దిమందిలో ఈనాడు మురళీ గారొకరు. ప్రత్యేకించి - భారత శిక్షాస్మృతి, చలనచిత్ర చట్టము, ఆహార కల్తీ నివారణ చట్టము, జనన మరణ రిజిస్ట్రీకర చట్టము వంటి డాక్యుమెంట్లను తెవికీసోర్సు ద్వారా డిజటలీకరించి చట్టాలను గురించి తెలుసుకునే అవకాశాన్ని ప్రతీ ఒక్కరికీ కల్పించే చక్కటి కృషిని ఆయన చేస్తున్నారు. తెవికీసోర్సుతో పాటుగా ఇంగ్లిష్ వికీసోర్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల చరిత్రకు సంబంధించిన ఆంగ్ల రచనల మీద కూడా పనిచేస్తున్నారు. అలా అందుబాటులో లేని అవసరమైన సమాచారాన్ని డిజిటలీకరణ ద్వారా అందరికీ అందిస్తున్న సమాచార సేతువు ఆయన.

# వికీరాకెట్టు

మనం రోడ్డు పక్కన కాళ్ళీడ్చుకుంటూ నడుస్తూ పోతూంటాం. వెనకనుండి ఒక కారు 60 కి.మీ. వేగంతో మనల్ని దాటేసి దూసుకుపోయిందనుకోండి... అబ్బో భలే దూసుకుపోతున్నాడే అనుకుంటాం. ఆ వెంటనే ఒక రేసుకారు 300 కి.మీ. వేగంతో ఝుప్ మని పోయిందనుకోండి... ఏమనుకుంటాం? ఏమీ అనుకోం... ఏం జరిగిందో అర్థం కాక, బ్రమ్మపడిపోయి, నోరుతెరుచుకుని అలా చూస్తూండిపోతాం. మా బత్తిని వినయ్ కుమార్ గౌడ్ ఆ రేసుకారును మించినవాడు!

ఆయన తెవికీలోకి వచ్చి ఐదేళ్ళే అయింది. మొదటి రెండేళ్ళు పెద్దగా ఏమీ రాయలా. 2020 దాకా వినయం గానే ఉన్నాడు. :-) ఆ ఎవరో వినయ్ అంట... కొత్తగా వచ్చాడు, అనుకున్నాం. కౌంట్‌డౌన్ సమయంలో లాంచ్‌ప్యాడు మీద నిలబడ్డ ఇస్రో రాకెట్టు కూడా అలాగే ఉంటది - నిశ్శబ్దంగా, ఏదో తపస్సు చేసుకుంటున్నట్టు. ఇతను ఆ టైపని మాకు తెలీదప్పటికి. 2021 లో జూలు విదిల్చాడు. స్టార్టైన రాకెట్టు ఎలా వెళ్తుంది... గురి లక్ష్యమ్మీదే ఉంటది, పక్కచూపులుండవ్. కన్నుమూసి తెరిచేలోపు దూసుకుపోతుంది. వినయ్ కూడా అంతే.. మూడేళ్ళలో లక్ష దిద్దుబాట్లు దాటాడు. కొత్త వ్యాసాలు ఎన్ని రాసారో తెలుసాండీ... 8,425! క్షమించాలి... ఈ సంఖ్యలు, ఇది చెప్పడం మొదలుపెట్టే సమయానికండి... ఈ క్షణాన మా రాకెట్టు ఎక్కడుందో చెప్పలేం.

అసలు ఆ స్పీడేంటో గానీ... 2024 జనవరి నాటికి, 21 నెలల నుండీ... రోజుకు 10 కొత్త వ్యాసాల చొప్పున లెక్కపెట్టి మరీ రాస్తున్నాడు. ఏనాడూ 10 కి తగ్గలేదు. సృష్టించిన వ్యాసాల సంఖ్యలో అతనే తెవికీ ఫస్ట్. ఇస్రో

రాకెట్టు లాగానే వినయ్ కూడా ఇటూ అటూ చూడడు- లక్ష్యమ్మీదే గురి. ఎవరితోటీ మాటాడ్డు. ఆయన పేజీకి వెళ్ళి పలకరించినా "ఊ" అని కూడా అనడు.

పది పదిహేనేళ్ళుగా వికీలో రాస్తూ ఉన్న హేమాహేమీల నందర్నీ వెనక్కి నెట్టేసి చాలా ముందుకు దూసుకుపోయాడు. కనీసం వెనక ఎవరెవరున్నారా అని రియర్ వ్యూ మిర్రరులో చూసే తీరిక కూడా లేదు ఈ పెద్దమనిషికి.

ఇదిగో ఇస్రో గారూ... ఇది సార్ మా వికీరాకెట్టు, మా విరాట్రాకెట్టు!

# వికీసోర్సుకు దేవీప్రసాదం

దేవీప్రసాదశాస్త్రి గారు 2020 ఏప్రిల్ లో తెవికీసోర్సులో స్వచ్ఛంద కృషి ప్రారంభించిన నాటి నుంచి దాదాపు నాలుగేళ్ళ కాలంలో ఆయన వికీసోర్సులో దిద్దుబాట్లు చేయని రోజులు ఏమున్నాయో వెతకడం, సముద్రపు ఇసుకలో పుంజీడు గుండుసూదులు పారేసి వెతకడం లాంటిది. ఉద్యోగానికి సెలవులు ఉంటాయి కానీ ఉద్యమానికి సెలవులు ఎందుకు అనుకున్నారో ఏమో కానీ నియమం ఉన్నట్టే స్వేచ్ఛా గ్రంథాలయంలో రోజూ కృషి సాగిస్తున్నారు. దాదాపు 40 వేల దిద్దుబాట్లు చేసారు.

ఒక్కో పేజీని టైప్ చేస్తూ, తప్పులు సరిదిద్దుతూ, ప్రూఫ్ రీడింగ్ చేస్తూ పుస్తకాలకు పుస్తకాలు పూర్తిచేస్తున్నారు. హంసవింశతి, ఉత్తర రామాయణము, హరవిలాసము, భక్తిరస శతక సంపుటాలు, గువ్వలచెన్నశతకము, రాధికాసాంత్వనము - ఇలా లెక్కపెట్టలేనన్ని రచనలను డిజిటలైజ్ చేసి వికీసోర్సు ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చే యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు.

మేము ఇది రాస్తున్నపుడూ, మీరిది చదువుతున్నపుడూ కూడా దేవీప్రసాదశాస్త్రి గారు తెవికీసోర్సులో ఏదో ఒక పుస్తకాన్ని డిజిటీకరించి అక్షరమన్న పదాన్ని సార్థకం చేస్తూండొచ్చు.

# వికీ కిరణం

వికీలోకి వస్తూనే నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన వ్యక్తులు అరుదుగా ఉంటారు. వారిలో నేతి సాయికిరణ్ ఒకరు. స్వయంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో తన కెరీర్‌ను నిర్మించుకున్న వ్యక్తి కావడం చేత, నీటిలో చేపలాగా తెవికీలో ఒదిగిపోయాడతను. వ్యాసాలు రాయడమే కాకుండా వికీప్రాజెక్టులలో ఎంతో కృషి చేసాడు. 2021 లో నిర్వహించిన ఫొటోలు చేర్చే ప్రాజెక్టులో కృషిచేసి, 7,500 పేజీల్లో బొమ్మలు చేర్చి తెవికీలోకెల్లా అగ్రస్థానంలో నిలిచాడు. అంతేకాదు, 2022 లో తాను స్వయంగా ఆ వికీప్రాజెక్టు చేపట్టి విజయవంతంగా నిర్వహించాడు.

వికీమీడియా మూవ్‌మెంటు పనుల్లో చురుగ్గా ఉంటూ మెటా స్థాయిలో కూడా కృషి చేస్తూ ఉంటాడు. ఇతర స్వచ్ఛంద తెలుగు ప్రాజెక్టుల గురించి తెవికీలో చెబుతూ ఇక్కడి వారికి అవగాహన కలిపిస్తూ ఆ ప్రాజెక్టులకు ఊపునిస్తూ ఉంటాడు. లింగ్వా లిబ్రే అనే ప్రాజెక్టు గురించి తెవికీలో చెప్పి కొందరు వికీమీడియన్ల దృష్టిని అటువైపు మళ్ళించాడు. దాంతో ఆ ప్రాజెక్టులో ఏ ప్రగతీ లేకుండా నేలబారుగా ఉన్న తెలుగు విభాగం ఒక్కసారిగా స్ట్రాటోస్ఫియరు లోకి దూసుకుపోయింది.

అంతేకాదు, అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న కొన్ని భాషలలో విజ్ఞాన భాండాగారం తయారు చేసేందుకు కూడా సాయికిరణ్ కృషి చేస్తున్నారు. ఆ కృషిలో భాగం గానే గోండి, కొలామి భాషల వికీపీడియాలను స్థాపించాలనే ప్రయత్నంలో ఉన్నారు.

# భావికీపీడియన్

2021లో తెవికీకి లభించిన కృషీవలులలో దివ్య ఒకరు. అనువాద పరికరం ఉపయోగించి విరివిగా వ్యాసాలు రాసారు. వికీ గురించి తెలిసిన తరువాత రాయకుండా ఉండలేని వారు కొందరుంటారు. అనువాద పరికరం గురించి తెలిసిన తరువాత దాన్ని ఉపయోగించకుండా ఉండలేని వారు ఇంకొందరుంటారు. అటువంటి వారిలో దివ్య ఒకరు.

అనువాద పరికరం ద్వారా ప్రచురించిన వ్యాసాల సంఖ్యలో అగ్రస్థానాల్లో ఉన్నవారిలో ఆమెది నాలుగో స్థానం. పరికరం ఇచ్చే యాంత్రికానువాదాల్లో కర్మణి వాక్యాలను కర్తరి వాక్యాలుగా మార్చి ప్రచురించే జాగ్రత్త తీసుకోవడం ఆమె రచనల్లో ప్రత్యేకత. ఢిల్లీలో జరిగిన వికీ విమెన్స్ క్యాంపులో పాల్గొని, తన వికీ కృషికి గాను అక్కడ ల్యాప్‌టాప్ బహుమానంగా పొందారు. లింగ్వా లిబ్రేలో తెలుగు పదాల ఆడియో ఫైళ్ళు చేసారు. వికీప్రాజెక్టుల్లో చురుగ్గా పాల్గొంటారు. క్రికెట్ 2023, విశాఖపట్నం, ఫొటోల చేర్పు వంటి ప్రాజెక్టుల్లో గణనీయమైన కృషి చేసారు. వందలాది బొమ్మలను తెవికీ లోకి ఎక్కించారు. వచ్చే పదేళ్ళు వికీని నడిపించే సముదాయంలో దివ్య ఉంటారు.

# రాబోయే కాలానికి కాబోయే నాయకుడు

ఇపుడో పెద్దమనిషి గురించి. రాతల్ని బట్టి, చేసే చర్చలను బట్టీ వ్యక్తి మూర్తిమత్వాన్ని అంచనా వెయ్యగలిగితే, మురళీకృష్ణ ఎమ్ గారిని పెద్దమనిషి అనాలి. దోష రహితమైన భాషలో చక్కటి వ్యాసాలు రాయడంలో పోటీ పెడితే గట్టిపోటీ ఇవ్వగల వికీపీడియన్ మురళీకృష్ణ. భాష మాత్రమే కాదు, వికీపీడియాలో నిర్వచించుకున్న విధానాలను, మార్గదర్శకాలనూ ఖచ్చితంగా పాటిస్తారు.

ఆయన వికీకి వచ్చిన కొత్తలో, వికీ శైలి ప్రకారం తేదీ ఆకృతి ఇలా ఉండాలండీ అని సీనియర్లు చెప్పారు. ఇక ఆ తరువాత ఆ మార్గదర్శకాన్ని ఆయన ఏనాడూ మీరలేదు. ఈ విషయంలో అతను వికీపీడియన్లందరికీ అనుసరణీయుడు. మురళీకృష్ణ చర్చల్లో కూడా చురుగ్గా పాల్గొంటారు. అందుకు గాను నిర్వాహకుల నుండి మెప్పు కూడా పొందారు. 2021, 2022 సంవత్సరాల్లో ఫొటోలు చేర్చే ప్రాజెక్టులలో చురుగ్గా కృషి చేసారు. చర్చ కొంత కటువుగా మారుతున్న సందర్భంలో మౌనంగా పక్కకు తప్పుకుంటారు. వాడుకరులు అంతగా ఆసక్తి చూపని "మీకు తెలుసా?" వాక్యాలపై పని చేస్తూంటారు. రాబోయే సంవత్సరాల్లో తెవికీని ముందుకు తీసుకువెళ్ళే ముఖ్యుల్లో ఈయనొకరుగా ఉండే అవకాశం చాలానే ఉంది. తాను నిర్వాహకుడు కావాల్సిన అవసరం ఉందన్న సంగతి ఆయన గ్రహించారో లేదో గానీ ఇతరులు గ్రహించినట్టే ఉంది.

# భవ్యమైన రికార్డు

వికీపీడియా ద్వారా తమ రచనాశక్తిని ప్రదర్శించినవారు చాలామందే ఉన్నారు. వారిలో భవ్య ఒకరు. రాయడంతో సరిపెట్టకుండా వికీలో తమ గళాన్ని కూడా వినిపించిన వ్యక్తి ఆమె. మొన్ననే, 2022 లోనే, వికీలోకి వచ్చింది భవ్య. తెవికీ లోకి రావడంతోనే విరివిగా రాయడం మొదలుపెట్టింది. అది క్రికెట్ 2023 కావచ్చు, విశాఖపట్నం ప్రాజెక్టు కావచ్చు - వికీప్రాజెక్టులలో భవ్య చురుగ్గా కృషి చేస్తుంది.

చాలామంది లాగానే భవ్యకు కూడా వికీమీడియనుగా తెలుగు వికీపీడియానే పుట్టినిల్లు. అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ అన్నట్టుగా ఆమె తెవికీకి విశిష్టత తెచ్చింది. తెవికీలో రాస్తూండగానే లింగ్వా లిబ్రే సైటులో పనిచేసింది. ఆమె అందులో 76 వేల పదాలకు పైగా ఆడియో ఫైళ్ళు తయారు చేసింది. నేలబారుగా పడి ఉన్న తెలుగు భాషా పదాల గణాంకాలు ఛివ్వున తాచుపాములా లేచినై. తెలుగు విభాగం 4 వేల నుండి 90 వేల ఫైళ్ళకు దూకింది. ప్రపంచంలో 27 వ స్థానంలో ఉన్న తెలుగు అమాంతం 4వ స్థానానికి ఎగబాకింది. అంతే కాదు, లింగా లిబ్రేలో మాట్లాడిన స్పీకర్లలో ప్రపంచంలోనే న్యూమరో యూనో, మా భవ్య.

వికీలో మహిళల భాగస్వామ్యం పెంపొందించేందుకు చొరవ తీసుకుని వికీ సహచరులతో కలిసి ఒక ప్రాజెక్టు చేపట్టి, దాని గురించి వివరించి ఫౌండేషను నుండి గ్రాంటు పొందింది.

రాబోయే కాలానికి కాబోయే తెవికీ నిర్వాహకురాలీమె.

# అస్తమించిన భాస్కరుడు

2011 నుండి పదేళ్ళ పాటు తెవికీలో వెలుతురు పంచిన వ్యక్తి భాస్కరనాయుడు గారు. మొత్తం అన్ని వికీప్రాజెక్టుల్లోనూ కలిపి 3 లక్షల 74 వేల దిద్దుబాట్లు చేసారు.

ఎక్కువగా తెలుగు వారు, తెలుగు సంస్కృతి, తెలుగు గ్రామీణ వాతావరణం, పల్లె వాసుల జీవన విధానము, తెలుగు జాతీయాలు, సామెతలు లాంటి అంశాలపై కృషి చేసేవారు. తెలుగుదనాన్ని ప్రదర్శించే బొమ్మలను ఎక్కించేవారు. ఆయన కామన్సులోకి ఎక్కించిన వీడియో ఒకటి, 2017 జనవరి 3 న మీడియా ఆఫ్ ది డే గా ఎంపికైంది. ఇదొక అరుదైన ఘనత. తెవికీలో 2 లక్షల పైచిలుకు దిద్దుబాట్లు చేసి ఒక రికార్డు సృష్టించారాయన.

రికార్డులు శాశ్వతం కాదు, కానీ తెవికీలో ఆయన చేసిన కృషి మాత్రం శాశ్వతం. ఆయన మరణించారు కానీ ఆయన చేసిన కృషికి మరణం లేదు. తెవికీ ఆయన కృషిని మరువదు.

ఆయనకు మా గౌరవ పురస్సరమైన శ్రద్ధాంజలి.

# ఉపసంహారం

ఇదంతా వికీమీడియన్ల కీర్తిగానం లాగా వినిపించి ఉండవచ్చు. అందరూ మహామహులేనా అసలు ఏ దోషాలూ లేని ఏ తప్పూ చెయ్యని అసామాన్యులా అని అనకండి. మేం రోజూ వికీల్లో మా మా తప్పుల్నే ఎంచుకుంటూంటాం. తెగేదాకా లాక్కుంటూంటాం. తెగేవేళకు మాలోనే ఎవరో ఒక మర్యాద రామన్న వచ్చి ఇక ఆపండి. ఇద్దరిదీ తప్పే, ఇలా చేద్దాం అని సర్దిచెబుతాడు. తప్పు దిద్దుకుంటాం. ఆ మేరకు వ్యాసం బాగుపడుతుంది. గొప్పలు చెప్పుకునే ఆవకాశం ఎలాగూ ఉండదు అక్కడ. అందుకే.., గొప్పతనాలను చెప్పుకునేందుకే ఈ పుస్తకం!

ఎవర్రాసారివి? ఎందరో మహానుభావులు -అందరికీ మా వందనాలు!

వీరేనా వికీవీరులు. ఇంకెవరూ లేరా? ఎందుకు లేరూ... ఉన్నారు. వికీలో కృషి చేస్తున్న మౌనమునులు, అన్‌సంగ్ హీరోలు ఎందరో ఉన్నారు. వారి గురించి కూడా చెప్పాలి, చెబుతాం. ఇది మొదలు మాత్రమే. ముందుముందు మరిన్ని చిరుచిత్రాలు వస్తాయి. మరెందరో గొప్ప వికీపీడియన్లు వస్తారు. ఇకనుండి ఏటా పుస్తకం వేస్తాం. మరిన్ని విశేషాలు తెస్తాం. అప్పటివరకూ...

నమస్కారం.

తెవికీలో అందరూ ఎల్లప్పుడూ పనిచేయరు. కొన్నేళ్ళు పనిచేసి మానేస్తారు. కొత్త నీరు వస్తూంటుంది, పాత నీరు పోతూంటుంది. కొందరు మళ్ళీ వస్తారు పనిచేస్తారు. ప్రతి ఒక్కరూ చేసిన పనుల్ని వికీ గుర్తుంచుకుంటుంది. అవన్నీ వికీలో చిరస్థాయిగా నిలిచే ఉంటాయి. వికీమీడియా ప్రాజెక్టులు వాళ్ళ కృషిని ప్రతిఫలిస్తూ దేదీప్యంగా వెలుగుతూ ఉంటాయి, ఉన్నాయి. అలా వికీలకు వెలుగులద్దిన కొందరు వికీసూర్యులకు మా దివిటీ ఇది.

...అందరికీ వందనాలు